



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 329 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 17-03 -2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

## గల్ఫ్ యుద్ధం వేళ చైనా దూకుడు

- తైవాన్ దిశగా యుద్ధనౌకలు, విమానాల మొహరింపు

తైపీ,, – మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
గల్ఫ్ యుద్ధంతో అంతా అటువైపు దృష్టి పెట్టగా చైనా మరోమారు తైవాన్‌పై దృష్టి సారించింది. గత రెండు వారాలుగా కొంత నిశ్శబ్దంగా ఉన్న చైనా సైన్యం.. మళ్ళీ తైవాన్ సరిహద్దుల్లో తన ప్రాబల్యాన్ని చాటుకోవడం మొదలుపెట్టింది. తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, గత 24 గంటల్లో భారీ సంఖ్యలో , -మిగతా 2 లో



## అన్ని రాష్ట్రాల్లో ఎల్పీజీ స్టాక్ ఉంది


- గృహ వినియోగదారులకు వంద శాతం ఎల్పీజీ సరఫరా చేస్తాం
- వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన

న్యూఢిల్లీ, -
వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు వంద శాతం ఎల్పీజీ సరఫరా చేస్తామని కేంద్రం స్పష్టం చేసింది. అన్ని రాష్ట్రాల్లో ఎల్పీజీ స్టాక్ ఉందని తెలిపింది. హర్మూజ్ దగ్గర భారత నౌకలన్నీ క్షేమంగానే ఉన్నాయని, శివాలిక్ నౌకలో 48 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్ ఉందని కేంద్రం వెల్లడించింది. కాగా, ఖతార్ నుండి లిక్విడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన 'శివాలిక్' నౌక సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను పూర్తిగా నిలిపి వేసింది. దీంతో దేశ వ్యాప్తంగా ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు మెల్లమెల్లగా మూతపడుతున్నాయి. హాస్టల్స్ మెనూను పూర్తిగా మార్చేశాయి.
-మిగతా 2 లో



## ఇరాన్ డ్రోన్ దాడులు తీవ్రం

- దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో దాడి
- ఇంధన ట్యాంకర్ వద్ద చెలరేగిన మంటలు



టెహ్రాన్, -
ఇరాన్ తో ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్.. డ్రోన్ దాడుల ను తీవ్రతరం చేసింది. తన పొరుగుదేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. సోమవారం తెల్లవారుజామున దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమిపంలో డ్రోన్ దాడులు చేసింది. ఈ సందర్భంగా ఒక డ్రోన్ ఇంధన ట్యాంక్‌ను ఢీకొట్టడంతో భారీగా మంటలు చెలరేగాయి. దాంతో విమానాశ్రయంలోని అన్ని విమానాలను తాత్కాలికంగా నిలిపివేశారు. విమానాశ్రయాన్ని మూసివేసినట్లు దుబాయ్ సివిల్ ఏవియేషన్ అథారిటీ అధికారులు ప్రకటించారు. ప్రయాణికులు, ఎయిర్‌పోర్టు సిబ్బందికి సేఫ్టీ నోటీస్
-మిగతా 2 లో

## రాష్ట్రాభివృద్ధికి రోడ్‌మ్యాప్

### ప్రపంచానికే ఆదర్శంగా తెలంగాణను నిర్మిస్తాం

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- సమ్మిళిత వృద్ధి సాధించేందుకు ముందుకు సాగుతాం
- ప్రపంచ నగరాలు, దేశాలతోనే పోటీ
- 67,763 ఉద్యోగాల భర్తీ
- ప్రభుత్వోద్యోగులు, వారి కుటుంబాలకు నగదు రహిత వైద్యం
- ఉభయసభలనుద్దేశించి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా
- ప్రతిపక్ష నేత కేసీఆర్ గైర్హాజరు
- వందేమాతరం గీతాలాపన సమయంలో ఎంఐఎం వాకౌట్
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు షురూ

హైదరాబాద్ మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి స్పష్టమైన రూట్‌మ్యాప్‌తో ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా అన్నారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థికాభివృద్ధి 3 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. రాష్ట్రాన్ని ఆవిష్కరణల కేంద్రంగా, ప్రపంచానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణను నిర్మిస్తున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అహరహం కృషి చేస్తున్నామన్నారు.
-మిగతా 2 లో



మార్చి 31 వరకు


## తెలంగాణ అసెంబ్లీ

- 20న సభల బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి
- ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి సెలవులు
- బీఏసీ సమావేశంలో నిర్ణయం



హైదరాబాద్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 31 వరకు జరగనున్నాయి. ఈ మేరకు బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షత బీఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశాల నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్చి 16 నుంచి మార్చి 31 వరకు సమావేశాలను నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. సోమవారం ఉదయం గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు
-మిగతా 2 లో

## లడాఖ్ మట్టి సూక్ష్మజీవులతో క్యాన్సర్ చికిత్స




### 8 ఏళ్ల బాలికపై.. ముగ్గురు బాలురు సామూహిక అత్యాచారం




## ఊపిరాడని హైదరాబాద్..



గాలి కాలుష్యం పెరుగుతోంది



- ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో
- తక్షణ చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత భయంకరం
- 'నీలగిరి ఎక్స్ ప్రెస్" ప్రత్యేక కథనం

హైదరాబాద్, మార్చ్ 16 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )
దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మెట్రో నగరాల్లో ఒకటైన హైదరాబాద్‌లో గాలి కాలుష్యం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పరిశ్రమలు, వాహనాల పెరుగుదల, చెత్త దహనం, నిర్మాణ పనుల ధూళి వంటి కారణాలతో నగర వాతావరణం రోజు రోజుకు కలుషితమవుతోంది. నగరంలో లక్షల సంఖ్యలో వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయి. వాటి నుంచి విడుదలయ్యే పొగ గాలిలో విషపూరిత వాయువుల పరిమాణాన్ని పెంచుతోంది. మరోవైపు కొన్ని పరిశ్రమలు విడుదల చేస్తున్న రసాయన వాయువులు గాలి మరియు నీటి కాలుష్యానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. పలు ప్రాంతాల్లో చెత్తను బహిరంగంగా కాల్చడం కూడా కాలుష్యాన్ని మరింత పెంచుతోంది. చెత్త నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల
-మిగతా 2 లో





## మార్చి 31 వరకు
# తెలంగాణ అసెంబ్లీ

మొదటి తరువాయి

ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ సభను మంగళవారం వాయిదా వేశారు. అనంతరం స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై చర్చించారు. మార్చి 17, 18న గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఈనెల 20న అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెను ప్రవేశపెట్టనుంది. ఆపై 23 నుంచి 26 వరకు బడ్జెట్‌పై చర్చలు జరపనున్నారు. మార్చి 31న ద్రవ్య వినిమియ బిల్లుపై చర్చ జరగనుంది. అలాగే ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి అసెంబ్లీకి సెలవులు ప్రకటించనున్నారు. బీఏసీ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు. బీఆర్ఎస్ నుంచి హరీశ్ రావు, కేపీ వివేక్ హాజరవగా.. బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు సమావేశంలో పాల్గొన్నారు.

## ఇరాన్ డ్రోన్ దాడులు తీవ్రం

మొదటి తరువాయి

జారీచేశారు. విమానాల స్టేటస్ తెలుసుకునేందుకు విమానయాన సంస్థలను సంప్రదించాలని ప్రయాణికులకు సూచనచేశారు. అంతేగాక పలు విమానాలను అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. ఇంధన ట్యాంక్‌కు అంటుకున్న మంటలను ఆర్పేందుకు దుబాయ్ సివిల్ డిఫెన్స్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. సమీపంలోని ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇంధన ట్యాంక్‌పై దాడి నేపథ్యంలో ఈ ప్రాంతంలోని కీలకమైన ఇతర మౌలిక సదుపాయాల వద్ద భద్రత పెంచినట్లు అధికారులు పేర్కొన్నారు.

## గల్ఫ్ యుద్ధం వేళ చైనా దూకుడు

మొదటి తరువాయి

నౌకలు చైనా యుద్ధ విమానాలు తైవాన్ గగనతలంలోకి ప్రవేశించాయి. కాగా, ఫిబ్రవరి 27 నుండి మార్చి 13 వరకు తైవాన్ సరిహద్దుల్లోకి చైనా యుద్ధ విమానాల రాక గణనీయంగా తగ్గింది. సాధారణంగా ప్రతిరోజూ పదుల సంఖ్యలో విమానాలను పంపే చైనా, ఈ 16 రోజుల కాలంలో కేవలం 7 విమానాలను మాత్రమే పంపింది. అయితే, ఈ ఆకస్మిక విరామానికి కారణమేంటో రక్షణ నిపుణులకు సైతం అంతుచిక్కలేదు. కానీ, ఆదివారంనుండి చైనా మళ్ళీ తన దూకుడును పెంచింది. తైవాన్ చుట్టూ సుమారు 26 చైనా సైనిక విమానాలను గుర్తించారు. వీటిలో 16 విమానాలు తైవాన్ నైరుతి ఎయిర్ డిఫెన్స్ ఐడెంటిఫికేషన్ జోన్ లోకి ప్రవేశించాయి. విమానాలతో పాటు 7 చైనా యుద్ధ నౌకలు కూడా తైవాన్ సముద్ర తీరానికి సమీపంలో చక్కర్లు కొడుతున్నాయి. ఫిబ్రవరి 25న 30 విమానాలు వచ్చిన తర్వాత, మళ్ళీ ఈ స్థాయిలో విమానాలు రావడం ఇదే తొలిసారి. ఇలాఉండగా, మార్చి 31న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాలో పర్యటించనున్నారు. ఇక, చైనా విమానాలు లేని సమయంలో కూడా వారి యుద్ధ నౌకలు సముద్రంలోనే ఉన్నాయని తైవాన్ రక్షణ మంత్రి వెల్లింగ్టన్ కూ స్పష్టం చేశారు. చైనా నుండి ముప్పు ఏమాత్రం తగ్గలేదని.. తాము నిరంతరం అప్రమత్తంగానే ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

## అన్ని రాష్ట్రాల్లో ఎల్పీజీ స్టాక్ ఉంది

మొదటి తరువాయి

కేవలం ఒక కర్రీతో సరిపెడుతున్నాయి. గ్యాస్ కొరత కారణంగా పలు దేవాలయాలు తాత్కాలికంగా ప్రసాదం తయారీని నిలిపివేశాయి. సీఎన్‌జీ బంకుల్లోనూ గ్యాస్ నిల్వలు అడుగంటుతున్నాయి. దీని కారణంగా గ్యాస్‌తో నడిచే వందలాది ఆటోలు నిలిచిపోతున్నాయి. డొమస్టిక్ గ్యాస్ సిలిండర్ల వినియోగదారులకు కూడా కష్టాలు తప్పటం లేదు. బుకింగ్, డెలివరీ విషయంలో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్యాస్ సిలిండర్ కోసం వినియోగదారులు గంటల తరబడి క్యూలో వేచి ఉంటున్నారు. యుద్ధ పరిస్థితులకు తోడు.. పండుగ సమయం కావటంతో గ్యాస్ సిలిండర్లకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా జనం గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడి సిలిండర్ తీసుకుంటున్నారు

# ఊపిరాడని హైదరాబాద్...

మొదటి తరువాయి



విషపూరిత పొగ గాలిలో కలసి ప్రజలకు అనేక ఆరోగ్య సమస్యలను కలిగిస్తోంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నవారిపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణ నిపుణులు చెబుతున్నదాని ప్రకారం ప్రభుత్వం వెంటనే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలి. కాలుష్యాన్ని సృష్టించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాల ఉద్గారాలపై కట్టడి చేయాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు. అలాగే నగరంలో చెత్త దహనాన్ని పూర్తిగా నిషేధించి చెత్త నిర్వహణను శాస్త్రీయంగా నిర్వహించాలి. నగరంలో మరిన్ని గ్రీన్ జోన్లు, పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా గాలి నాణ్యతను మెరుగుపరచవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. హైదరాబాద్ అభివృద్ధి ఎంత వేగంగా జరుగుతుందో, అదే స్థాయిలో పర్యావరణ పరిరక్షణపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ప్రజా సంఘాలు కోరుతున్నాయి. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రాష్ట్రాభివృద్ధికి రోడ్‌మ్యాప్



సోమవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయసభలనుద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగించారు. ప్రారంభంతో పాటు ముగింపు లోనూ తెలుగులో ఆయన మాట్లాడారు. ప్రసంగం మధ్యలో కొన్నిసార్లు తడబడ్డారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ త్రిభాషలో ఆయన ప్రసంగం సాగింది. కొన్ని పదాలను స్పష్టంగా పలకకపోవడంతో సభ్యులకు అర్థంకాక కొంత ఇబ్బంది పడ్డారు. ప్రస్తుత బడ్జెట్ కేవలం ఆర్థిక కేటాయింపుల గురించి మాత్రమే కాకుండా, బలమైన, స్థిరమైన రాష్ట్రాన్ని నిర్మించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు. ప్రభుత్వం తెచ్చే ప్రతి పథకం, విధానం, కార్యాచరణలో ప్రజల ఆత్మగౌరవం, సంక్షేమం, సామాజిక సమానత్వం పాటించడమే ప్రజాపాలనకు గీటురాయిగా పాలనలో ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తున్నామన్నారు. 'తెలంగాణ రైజింగ్ విజన్-2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించామని తెలిపారు. 2025-26లో రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) రూ.17.82 లక్షల కోట్లు కాగా, 10.7 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని అన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.99 శాతమనీ, రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కి చేరిందని వివరించారు. ద్రవోల్బణాన్ని 0.2 శాతానికి నియంత్రించామనీ, రాష్ట్రంలో ధరల స్థిరత్వం కొనసాగిందని చెప్పారు. నీటి పారుదల సదుపాయాలు మెరుగుపరిచి, వ్యవసాయ ఉత్పాదకత పెంచామనీ, అన్నదాతలకు పెట్టుబడి సాయం అందిస్తూ, అనేక రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడంచెల వికేంద్రీకృత వ్యూహాన్నీ అనుసరిస్తున్నామన్నారు. 2031 నాటికి రాష్ట్రంలో పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుకుంటుందనీ, దానిలో భాగంగానే జీహెచ్ఎంసీని సైబరాబాద్, మల్కాజిగిరి, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించామన్నారు. కొత్తగా తెస్తున్న క్యూర్ చట్టంతో హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు,హైడ్రాను ఒకటే పాలనా పరిధిలోకి తీసుకొస్తామని చెప్పారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌తోపాటు, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, కొత్తగా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించామని అన్నారు. కాలుష్యం నుంచి తప్పించేందుకు హిల్ట్ పాలసీని అమలు చేస్తున్నామన్నారు. రూ.60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాలకుపైగా ఆక్రమణలు, కబ్జాలకు గురైన చెరువు భూములు, ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నామని వివరించారు. 55 కిలోమీటర్ల మూసీ రివర్ ఫ్రంట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టును ప్రజా ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్యలో 360 కిలోమీటర్ల ప్యూర్ (పెరి-అర్బన్ రీజియన్ ఎకానమీ) ప్రాంతాన్ని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించామనీ, ఇక్కడ పలు రకాల పరిశ్రమలను ప్రోత్సహిస్తామన్నారు. కొడంగల్ ఏరియా ఇండస్ట్రియల్ హబ్‌ను అభివృద్ధి చేసేందుకు రాబోయే రేడియల్ రోడ్డు వెంట మల్టీ ప్రొడెక్ట్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తామని అన్నారు. జహీరాబాద్‌లో 3,245 ఎకరాల్లో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ స్మార్ట్ సిటీ అభివృద్ధి జరుగుతోందన్నారు. ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య అనుసంధానానికి రేడియల్ రోడ్లను నిర్మించే ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. హైదరాబాద్ నుంచి ఫ్యూచర్ సిటీ, అమరావతి మీదుగా బందర్ పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ హైదరాబాద్-అమరావతి మధ్య ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మించనున్నట్టు వివరించారు. శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్, బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సులను ప్రస్తావించారు. రైతుభరోసా రూ.8,744 కోట్లు, సన్నరకం ధాన్యానికి బోనస్‌గా రూ.19,099 కోట్లను రైతులకు చెల్లించామన్నారు.

## ఏఐ-జనరేటెడ్' లైంగిక వేధింపుల
# కంటెంట్ నిషేధానికి యూరప్ తొలి అడుగు

**బ్రస్సెల్స్: మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కృత్రిమ మేధస్సు ద్వారా రూపొందించే పిల్లల లైంగిక వేధింపుల చిత్రాలను నిషేధించేందుకు యూరప్ కీలక చర్యలు ప్రారంభించింది. రెండు సంవత్సరాల క్రితం అమలులోకి వచ్చిన యూరోపియన్ యూనియన్ ఎఐ చట్టంలో ఈ నిబంధనను చేర్చాలని యూరోపియన్ యూనియన్ ప్రభుత్వాలు ప్రతిపాదించాయి. ఈ ప్రతిపాదన ప్రకారం, పిల్లల లైంగిక వేధింపులకు సంబంధించిన చిత్రాలు లేదా వీడియోలను రూపొందించే ఎఐ వ్యవస్థలను నిషేధించాలనే ఉద్దేశంతో చర్యలు తీసుకోనున్నారు. ఇటీవల టెక్ రంగంలో పెరుగుతున్న ఎఐ డీప్‌ఫేక్‌ల సమస్య ఈ నిర్ణయానికి ప్రధాన కారణమైంది. ప్రత్యేకంగా ఎలెన్ మస్క్ కు చెందిన ఎక్స్ ఎఐ రూపొందించిన గ్రోక్ ఎఐ చాట్ బాట్ ద్వారా తయారు అవుతున్న లైంగిక కంటెంట్, డీప్‌ఫేక్‌లపై యూరప్ నుండి



ఆసియా వరకు ప్రభుత్వాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇదే నేపథ్యంలో యుకె, ఇర్లాండ్, స్పెయిన్ దేశాల టెక్ నియంత్రణ సంస్థలు గ్రోక్ ద్వారా రూపొందిన అటువంటి కంటెంట్ ను పరిశీలిస్తున్నాయి. ఈ ప్రతిపాదన అమలులోకి రావాలంటే ముందుగా యూరోపియన్ పార్లమెంట్ మద్దతు అవసరం. చట్టసభ సభ్యులు బుధవారం దీనిపై ఓటింగ్ నిర్వహించనున్నారు. అయితే ఏఐ చట్టంలోని కొన్ని భాగాలను సడలించాలనే యూరోపియన్ కమీషన్ ప్రతిపాదనపై కూడా చర్చలు జరుగుతున్నాయి. టెక్ కంపెనీలు ఈ చర్యను స్వాగతిస్తుండగా, పౌర హక్కుల సంఘాలు మరియు గోప్యతా కార్యకర్తలు బిగ్ టెక్ లకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శిస్తున్నారు. ఏవైనా మార్పులు పూర్తిగా అమలులోకి రావడానికి సుమారు ఒక సంవత్సరం సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## గృహావసరాలకు సరిపడా ఎల్పీజీ గ్యాస్..
# పెట్రోల్, డీజిల్‌కూ కొరత లేదు

**న్యూఢిల్లీ: మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశంలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడిందని, త్వరలోనే గ్యాస్ సిలిండర్ ధర రూ.2,000 దాటుతుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. ఈ ప్రచారానికి తెరదించేందుకు కేంద్రం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు 100 శాతం ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌లు అందుబాటులో ఉన్నాయని ఆ ప్రకటనలో పేర్కొన్నది. అన్ని రాష్ట్రాల్లోనూ ఎల్పీజీ స్టాక్ గృహావసరాలకు సరిపోయేంత ఉందని తెలిపింది.అదేవిధంగా పెట్రోల్, డీజిల్ కూడా తగినంతగా అందుబాటులో ఉందని కేంద్రం తెలిపింది. అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. పెట్రోల్, డీజిల్ కొరత లేదని స్పష్టంచేసింది. పర్షియన్ గల్ఫ్ నుంచి బయలుదేరిన శివాలిక్ ఎల్పీజీ క్యారియర్ హార్మూజ్ జలసంధిని దాటి భారతదేశం సమీపానికి చేరుకుందని వెల్లడించింది. యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో ఆగిపోయిన అన్ని భారత నౌకలు సురక్షితంగా ఉన్నాయని కేంద్రం తెలిపింది.



పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని పేర్కొంది. ప్రతి నౌకలోని సిబ్బందితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించింది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 611 మందితో కూడిన 22 భారతీయ జెండా కలిగిన నౌకలు ఉన్నాయని తెలియజేసింది.

# సైబర్ మోసాలపై పోలీసుల అవగాహన సదస్సు



**పెద్దపల్లి, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

గ్రామీణ ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించి నేరాలను నివారించేందుకు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేశ్ ఆధ్వర్యంలో రాంపల్లి గ్రామంలో సైబర్ మోసాలు, రోడ్డు భద్రత మరియు నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజలు పోలీసులతో సహకరిస్తూ చట్టాలను పాటిస్తే నేరాలను సమర్థవంతంగా తగ్గించవచ్చని సూచించారు. గ్రామస్థులకు సైబర్ నేరాల నుండి ఎలా జాగ్రత్తపడాలి, అనుమానాస్పద ఫోన్ కాల్స్, ఓటీపీలు, లింకులు ఇతరులతో పంచుకోవద్దని వివరించారు. అదేవిధంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించడం, హెల్మెట్ వినియోగం, అతివేగం మరియు నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో మద్యపానం నిషేధం అమలు చేయాలని, బెల్ట్ షాపులు నిర్వహించకూడదని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామ అభివృద్ధి మరియు ఆరోగ్యకరమైన వాతావరణం కోసం తీసుకున్న ఈ నిర్ణయాన్ని పోలీసులు అభినందించారు. రాంపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని మిగతా గ్రామాలు కూడా మద్యపాన నిషేధం అమలు చేయడంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సీఐ ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీడీఓ, పీహెచ్‌సీ డాక్టర్, పోలీస్ సిబ్బంది మరియు సుమారు 200 మంది గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్షిప్‌లో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థుల విజయాలు



**పెద్దపల్లి, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ జిల్లా కొత్తపల్లి ఓకినావ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్షిప్‌లో గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఎన్. సాద్వి జెస్వి, జె. సాత్విక్, శ్రీయన్, సన్యా జనత్ నాలుగు బంగారు పతకాలు గెలుచుకున్నారు. ఎన్. సాన్వి జెస్వి, పి. సహస్ర, పి. సాయి వర్షిత్ మూడు రజత పతకాలు సాధించారు. ఎం. సుప్రత్, ఏ. రీతిక్, జి. ప్రతిక్షి, జె. సహస్ర, బి. ఆరాధ్య, శ్రీ ఆధ్య ఆరు కాంస్య పతకాలు అందుకున్నారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ రాష్ట్ర కరాటే వైస్ ప్రెసిడెంట్ కె. వసంత్ కుమార్ చేతుల మీదుగా మెడల్స్, ప్రశంస పత్రాలు అందజేశారు. గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ విద్యార్థుల క్రమశిక్షణ, కరాటేలో ఉన్న నైపుణ్యాన్ని ప్రశంసించారు. విద్యార్థిని ఎన్. సాద్వి జెస్వి కూడా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపాల్ విజయ్, కరాటే కోచ్ ప్రవీణ్, పీఈటీలు అజయ్ కుమార్, మంజుల పాల్గొన్నారు.

## అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

-- ఆర్డీవో గంగయ్య



**పెద్దపల్లి, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య సూచించారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయనతో పాటు పాలనాధికారి బి. ప్రకాష్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన గెల్లు కేతమ్మ వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరగా, సంబంధిత అధికారికి రాసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతర్గం గ్రామానికి చెందిన కొంకటి స్వరూప ప్రభుత్వ పాఠశాలల యూనిఫాం కుట్టించే టెండర్ ఇవ్వాలని కోరగా, జిల్లా విద్యా శాఖ అధికారికి రాసి పరిశీలించాలని సూచించారు. ఎలిగేడు మండలం శివపల్లి గ్రామానికి చెందిన తాండ్ర సుమన్ గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బృంద ఫంక్షన్ హాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరగా, జిల్లా పంచాయతీ అధికారికి రాసి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో గంగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకొని అవగాహన ర్యాలీ



**గంగాధర, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మార్చి 22న జరగనున్న ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా గంగాధర మండలంలోని నాగుల్లమల్యాల గ్రామంలో సరస్వతి హై స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు మాట్లాడుతూ నీటిని సంరక్షించుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు గొప్ప నిధిని అందజేసిన వారమవుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్. చంద్రకళ--మోహనరావు, ఉప సర్పంచ్ కె. వెంకటేశ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కవిత, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మిట్టపల్లి రాజశేఖర్ ఈ వివరాలను తెలియజేశారు.

## ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన సదస్సు



**సిద్దిపేట, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సిద్దిపేట జిల్లాలో గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచే లక్ష్యంతో ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామ ప్రజలకు ఇంటి వద్దే చెత్తను వర్గీకరించి ఇవ్వాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి గ్రామ పంచాయతీ వాహనానికి అందజేయాలని, ఇలా చేయడం వల్ల గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు వ్యర్థాలను సరైన విధంగా పునర్వినియోగం చేయడం సాధ్యమవుతుందని వివరించారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతి గ్రామస్తుడు భాగస్వామిగా మారాలని, పరిశుభ్రతను కాపాడటం అందరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా నిర్ణీత స్థలాల్లోనే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సాహాస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల సహకారంతో నిర్వహించారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సాహాస్ ఎన్జీవో ప్రాజెక్టు మేనేజర్ అనూష మౌనిక, కోఆర్డినేటర్ ఇటుకాల చిన్న, సూపర్వైజర్లు బాలరాజ్, గౌడ్, సంపత్, వినీత్, స్రవినేష్, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, యువకులు, మహిళలు పాల్గొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో అందరూ కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## ఎస్సారెస్పీ కెనాల్‌కు గండి

-- వందల ఎకరాలకు సాగునీరు కరువు






**పాలకుర్తి, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామ శివారులోని తంగెళ్ళ గడ్డ వద్ద ఎస్సారెస్పీ కెనాల్‌కు గండి పడడంతో నీరు వృథాగా పోతుంది. ఎల్‌డీ 83 కెనాల్ ధర్మారం ఎక్స్‌రోడ్ నుండి బసంతనగర్, పాలకుర్తి, ఈశాల తక్కల్లపల్లి గ్రామాల మీదుగా పుట్నూరు వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర సాగుతుంది. వందల ఎకరాలకు సాగునీరు అందించే ఈ కాలువ పిచ్చి చెట్లు, పూడికతో నిండిపోవడంతో అరకొరగా వచ్చే నీరు గండి పడ్డ చోట వృథాగా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుట్నూరు గ్రామం వరకు దాదాపు 200 ఎకరాల వరి పొలాలు ప్రస్తుతం పొట్ట దశలో ఉండగా వేసవి కాలం కావడంతో బోర్లు, బావులలో నీరు సరిపోవడం లేదని వారు తెలిపారు. అధికారులు ఇప్పటి వరకు కాలువను సందర్శించి మరమ్మత్తులు చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఎస్సారె-స్పీ అధికారులు వెంటనే స్పందించి గండిని పూడ్చి పుట్నూరు గ్రామం వరకు సాగునీరు అందించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

## ఘోర రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**గన్నేరువరం, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కరీంనగర్ నుండి హైదరాబాద్ వెళ్తున్న టాటా పంచ్ కారు గుండ్లపల్లి స్టేజి వద్ద బైక్‌పై వెళ్తూ రోడ్డు క్రాస్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడిపిన కొమ్ము రాజ్‌కుమార్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో వ్యక్తి శ్రీకాంత్ గాయపడ్డాడు. ఈ ఘటనపై మృతుడి పెద్దమ్మ కొడుకు వేల్పుల తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు అతివేగంగా, అజాగ్రత్తగా నడిపిన మల్లోజుల అన్వేష్‌పై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

## జనగణన కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా నిర్వహించాలి

**పెద్దపల్లి, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



జనగణన 2027 కార్యక్రమాన్ని పెద్దపల్లి జిల్లాలో కట్టుదిట్టంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ సూచించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మూడు రోజులపాటు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనగణన తొలి దశలో హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సెస్ నిర్వహించబడుతుందని, ప్రజల నివాస గృహాల వివరాలు, మౌలిక సదుపాయాల స్థితి, కుటుంబాల వివరాలు నమోదు చేయబడతాయని తెలిపారు. జనగణన ప్రక్రియ పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి అధికారి మీద ఉందని, డేటా సేకరణ విధానం, డిజిటల్ పరికరాల వినియోగం, ఫీల్డ్ స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇవ్వబడుతోందని వివరించారు. అధికారులు పూర్తి స్థాయిలో శిక్షణ పొంది అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జిల్లాలో జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికకు అవసరమైన ఖచ్చితమైన గణాంకాలు సిద్ధమవుతాయని అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మండల మరియు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని గాయత్రి కళాశాల డిమాండ్



**పెద్దపల్లి, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోవడం వల్ల బోధన మరియు బోధేతర సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పెద్దపల్లి గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల అధ్యాపకులు తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగాలు లభించక ప్రైవేటు కళాశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ కుటుంబాలను పోషిస్తున్నామని, కానీ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడం వల్ల జీతాలు ఆలస్యమవుతున్నాయని, పిల్లల స్కూల్ ఫీజులు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ పరిస్థితి కొనసాగితే ఉపాధ్యాయులు ఉద్యోగాలను వదిలి వెళ్లిపోవాల్సి వస్తుందని, వారి కుటుంబాలు రోడ్డున పడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని కళాశాల యాజమాన్యాలకు చెల్లించవలసిన బకాయిలను విడుదల చేసి ఉద్యోగులను కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బండి ప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు.

# గ్రామ పంచాయతీ సిబ్బందికి ఘన సన్మానం



**గంగాధర, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గంగాధర గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నిరంతరం శ్రమిస్తున్న పంచాయతీ కార్యదర్శి, సఫాయి కార్మికులు, వాటర్ మెన్లను సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని, ఎండనక వాననక పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని, వారిని గౌరవించడం మన అందరి బాధ్యత అని అన్నారు. అనంతరం సిబ్బందికి శాలువాలు కప్పి సత్కరించి అవసరమైన సామగ్రిని అందజేశారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



**హుస్నాబాద్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు హుస్నాబాద్‌లో వాసవి క్లబ్ హుస్నాబాద్ గ్రేటర్ మరియు వనిత క్లబ్ హుస్నాబాద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా పలువురు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్ పర్సన్ నూక సంపత్ కుమార్, వాసవి క్లబ్ అధ్యక్షుడు వనపర్తి వంశీ, ప్రధాన కార్యదర్శి కంభంపాటి సందీప్, కోశాధికారి గౌరిశెట్టి రవితేజ, వనిత క్లబ్ అధ్యక్షురాలు చొల్లేటి లత, ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి మమత, కోశాధికారి మల్యాల రాధిక తదితరులు పాల్గొన్నారు.

## జీతాలు చెల్లించకపోవడంతో ఆశా వర్కర్ల నిరసన

**పెద్దపల్లి, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



గత రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో పెద్దపల్లి ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షురాలు అనవేన స్వరూప ఆధ్వర్యంలో సుమారు 200 మంది ఆశా వర్కర్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ పెద్దపల్లి బస్టాండ్ వద్ద ప్రారంభమై అయ్యప్ప ఆలయం, వ్యవసాయ మార్కెట్ వరకు వెళ్లి తిరిగి బస్టాండ్ వద్ద ముగిసింది. ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## అక్రమార్కులకు అడ్డాగా
# మారిన దేవతల బావి





**హుస్నాబాద్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలోని సిద్దిపేట రోడ్ దేవతల బావి వద్ద ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి ఆరోపించారు.సర్వే నంబర్ 608లో సుమారు 26 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ, ఆ భూమిపై అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. బాల వికాస్ వాటర్ ప్లాంట్ ముందు ఉన్న దేవతల బావి ప్రాంతంలో మున్సిపల్ అధికారుల నిఘా లేకపోవడం వల్ల అక్రమ కట్టడాలు పెరుగుతున్నాయని అన్నారు.ఈ విషయాన్ని గతంలోనే మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భూమికి బౌండరీ ఏర్పాటు చేయకపోవడం వల్ల అక్రమార్కులకు అడ్డాగా మారిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలు, బోర్లు మరియు ఇతర అక్రమ కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అఖిలపక్షాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.అలాగే గతంలో మున్సిపల్ సర్వేయర్ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, గృహ నిర్మాణదారులతో కుమ్మక్కై భూమిని తక్కువగా చూపించి అవినీతి పాల్పడ్డాడని ఆరోపించారు. ఈ వ్యవహారంపై జిల్లా ఏడీ ఆధ్వర్యంలో విచారణ జరిపించి పూర్తి స్థాయి సర్వే చేయాలని కవ్వ వేణుగోపాల్ రెడ్డి కోరారు.

# మహాత్మ జ్యోతి బాపులే గురుకులాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**తిమ్మాపూర్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



మహాత్మ జ్యోతి బాపులే గురుకులాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యా బోధన అందించి గురుకులాన్ని కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, వసతుల కల్పన, భోజన మెనూ, విద్యాబోధనపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు అన్ని సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం స్టాఫ్ రూమ్, వాష్‌రూమ్స్, వంటగది, స్టోర్ రూమ్, డార్మెటరీ గదులను పరిశీలించారు. స్టోర్‌లో ఉన్న బియ్యం, పప్పులు వంటి సామాగ్రి ఎక్స్పైరీ డేట్‌ను తరచుగా పరిశీలించాలని అధికారులకు సూచించారు.గురుకులంలో చేపట్టిన మోడ్రన్ కిచెన్ ఆధునికరణ పనులను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు రాకుండా ఎప్పటికప్పుడు ప్రత్యక్ష పర్యవేక్షణ జరపాలని, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.గురుకుల అభివృద్ధి, విద్యా బోధన, వసతుల కల్పనపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, గురుకుల ప్రిన్సిపాల్ సరిత, అధికారులు పాల్గొన్నారు.

# రైతు భరోసా నిధుల విడుదల నిర్ణయం హర్షనీయం



**హుస్నాబాద్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతు భరోసా నిధులను ఈ నెల 22 నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంతోషకరమని హుస్నాబాద్ డివిజన్ రైతు ఆత్మ చైర్మన్ జంగపల్లి ఐలయ్య తెలిపారు.అక్కన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూడా అయిన ఆయన, ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతు భరోసా నిధుల విడుదలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రైతు భరోసా నిధులను మూడు విడతల్లో విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. మొదటి విడతగా ఈ నెల 22న సిద్దిపేట జిల్లా నర్మెట్టలో 70 లక్షల మంది రైతులకు ఎకరం వరకు రూ.3,590 కోట్ల నిధులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. మరో 20 రోజుల్లో రూ.2,650 కోట్లను విడుదల చేసి, ఏప్రిల్ నెలాఖరులోగా మిగిలిన రైతుల ఖాతాల్లోకి నిధులు చేరనున్నాయని చెప్పారు.మొత్తం 1 కోటి 50 లక్షల ఎకరాలకు సంబంధించి సుమారు రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ కానున్నాయని జంగపల్లి ఐలయ్య పేర్కొన్నారు.

# పశు అంగడిపై నిబంధనలు అమలు చేయాలని వినతి



**హుస్నాబాద్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించే పశు అంగడిలో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రతి సంవత్సరం పశు అంగడిని టెండర్ ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగిస్తూ నిర్వహిస్తున్నప్పటికీ, వెటర్నరీ డాక్టర్ అనుమతి లేకుండా కొంతమంది వ్యాపారులు ఆవులు, గేదెలు, దూడలు, ఎద్దులను నిబంధనలకు విరుద్ధంగా పశువధశాలలకు తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అంగడి నిర్వహణ సమయంలో ప్రతి వారం తప్పనిసరిగా వెటర్నరీ డాక్టర్ అనుమతితోనే పశువులను తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు పాలు ఇచ్చే గేదెలు, నాగలి నడిపే ఎద్దులు కొనుగోలు చేయడానికి అధిక ధరలు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. ఈనెల 18న జరగనున్న హుస్నాబాద్ పశు అంగడి వేలం పాటలో పాల్గొనే వారు నిబంధనలు కచ్చితంగా పాటించేలా మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు బీఎస్పీ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో ఉచిత తనిఖీ హక్కు కల్పించాలని డిమాండ్

**భీమదేవరపల్లి, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**




ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల తరఫున సమాచారాన్ని పరిశీలించే ఉచిత తనిఖీ హక్కు కల్పించాలని హుస్నాబాద్ కాంటెస్టడ్ ఎమ్మెల్యే లంకసిరి రాజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.సమాచార హక్కు చట్టం--2005 ప్రకారం మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రికార్డులు, సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఈ చట్టం ద్వారా కల్పించబడిందని పేర్కొన్నారు.అందువల్ల ప్రజల తరఫున ఉచితంగా రికార్డులను పరిశీలించే అవకాశం కల్పించాలని సమాచార అధికారులను కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థ పారదర్శకంగా ఉండేందుకు సమాచార హక్కు చట్టం ద్వారా అందించే అవకాశాలను అధికారులు సక్రమంగా అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రజావాణి దరఖాస్తుల సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యలను ఆలకించి, బాధితులకు భరోసా నింపి, సత్వర పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా ప్రజల వినతిపత్రాలను స్వీకరించారు. వెంటనే పరిష్కరించగల దరఖాస్తులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, సమయం తీసుకునే వాటిపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి న్యాయం చేయాలని సూచించారు.వృద్ధులు, దివ్యాంగుల వద్దకే వెళ్లి వారి వినతిపత్రాలను స్వీకరించిన కలెక్టర్, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 290 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. ప్రజావాణి కార్యక్రమాన్ని సరికొత్తగా నిర్వహిస్తూ, ప్రజల సమస్యలకు టాప్ ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, కరీంనగర్ ఆర్డీవో కే. మహేశ్వర్, హుజురాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో రిమీడియల్ తరగతులు



**మార్చి 16, 2026 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సెమిస్టర్--II మరియు సెమిస్టర్--IV విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపరచేందుకు ప్రత్యేక రిమీడియల్ తరగతులు మార్చి 16 నుంచి ప్రారంభమయ్యాయి.ఈ తరగతులు ముందుగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం నిర్వహించబడతాయి. విద్యార్థులకు పునర్విమర్శ, సందేహ నివృత్తి, అభ్యాసం కోసం తగిన సమయం లభించేలా ప్రత్యేకంగా రూపొందించబడ్డాయి.విద్యా నాణ్యతను పెంపొందించడం, విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టబడిందని నిర్వాహకులు తెలిపారు. ఇది సంస్థ విద్యార్థుల విజయానికి కట్టుబాటును ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.

# హోటళ్లపై ఎమ్మార్వో ఆకస్మిక తనిఖీ



**అమ్రాబాద్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లపై రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు.తహసీల్దార్ (ఎమ్మార్వో) సైదులు, ఆర్ఐ శివ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో వాణిజ్య అవసరాల కోసం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గృహ వినియోగ డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వాడుతున్నట్లు గుర్తించారు. అధికారులు పలు హోటళ్ల నుండి సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో సైదులు మాట్లాడుతూ, హోటళ్లు, రెస్టారెంట్లలో కేవలం కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వినియోగించాలని, తక్కువ ధర కోసం డొమెస్టిక్ సిలిండర్లు వాడటం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ దాడుల్లో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

# డా. పడాల తిరుపతికి బెస్ట్ ఇండియన్ గోల్డెన్ పర్సనాలిటీ అవార్డు




**కరీంనగర్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (ఆటోనమస్) కరీంనగర్‌లోని వృక్షశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. పడాల తిరుపతి కి బెస్ట్ ఇండియన్ గోల్డెన్ పర్సనాలిటీ అవార్డు లభించింది.ఈ సందర్భంగా కళాశాలలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బోటనీ విభాగాధిపతి ప్రొఫెసర్ తిరుకోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థుల ఉన్నత విద్యాభివృద్ధి కోసం ఉచిత కోచింగ్ తరగతులు, ఔషధ మొక్కల ప్రాముఖ్యతపై వెబినార్లు, శాస్త్రీయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా డా. పడాల తిరుపతి విశిష్ట సేవలు అందిస్తున్నారని తెలిపారు.అదేవిధంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా జాతీయ ఐక్యత, గ్రామీణ అభివృద్ధి, సామాజిక చైతన్యం కోసం పలు కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. సమాజంలో చెడు అలవాట్ల నిర్మూలన, సంక్షేమ పథకాల అవగాహన కల్పించడంలో కూడా ఆయన చురుకుగా పాల్గొంటున్నారని వివరించారు.డా. పడాల తిరుపతి మాట్లాడుతూ, ఈ గౌరవం తన వ్యక్తిగత కృషికి మాత్రమే కాకుండా సహచర అధ్యాపకుల సహకారం, కళాశాల పరిపాలన ప్రోత్సాహానికి కూడా చెందిందని తెలిపారు. భవిష్యత్తులో విద్యా, సామాజిక సేవ కార్యక్రమాలలో మరింత చురుకుగా పాల్గొంటానని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డా. ఎం.డి. ఖేర్ హుస్సేన్, కె. కళా జ్యోతి, డా. బుంగా తిరుపతి, ఎం.డి. తాజుద్దీన్, ఎ. స్వరూపా రాణి తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు. అన్ని విభాగాల అధ్యాపకులు, సిబ్బంది కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# ట్రంప్ ఆగడాలపై మోడీ స్పందించాలంటూ సిపిఐ నిరసన




కరీంనగర్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై చమురు సంస్థలపై బాంబు దాడులు చేస్తూ నియంతలా వ్యవహరిస్తున్నాడని, హిట్లర్‌కు పట్టిన గతే ట్రంప్‌కు తప్పదని సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి విమర్శించారు.కరీంనగర్ గీతా భవన్ చౌరస్తాలో సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. గ్యాస్ సిలిండర్ల కొరతను ప్రతిబింబిస్తూ కట్టెల పొయ్యి వెలిగించి, సిలిండర్లు ఎత్తుకొని సిపిఐ నేతలు నిరసన తెలిపారు.చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ప్రపంచ దేశాలపై తన ఆధిపత్యాన్ని చలాయించాలని చూస్తున్నాడని, ఇరాన్ చమురు నిక్షేపాలపై దాడులు చేసి ఆయిల్ కొరతను సృష్టిస్తున్నాడని విమర్శించారు. ట్రంప్ యుద్ధోన్మాదం వల్ల దేశంలో గ్యాస్ కొరత ఏర్పడి, ప్రజలు 45 రోజులకు గాని సిలిండర్ పొందలేని పరిస్థితి ఉందని తెలిపారు.దేశ ప్రధాని నరేంద్ర మోడీ ట్రంప్ ఆగడాలపై మౌనం వీడి స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా, ఇజ్రాయిల్ దాడుల వల్ల మన దేశ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గ్యాస్ కొరతతో హోటళ్లు, వ్యాపార వర్గాలు కట్టెల పొయ్యిలకు మళ్లిపోతున్నాయని సిపిఐ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బోయిని అశోక్, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, బీర్ల పద్మ, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, మచ్చ రమేష్, కొట్టే అంజలి, తెరాల సత్యనారాయణ, గామినేనీ సత్యం, భారతి, కూన రవి, నగునూరి రమేష్, బాకం ఆంజనేయులు, చెంచల మురళి, ఆవునూరి రమేష్, బాపురెడ్డి, విష్ణు, రజిత, స్వప్న, సుజాత, రవళి తదితరులు పాల్గొన్నారు సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బోయిని అశోక్, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, బీర్ల పద్మ, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, మచ్చ రమేష్, కొట్టే అంజలి, తెరాల సత్యనారాయణ, గామినేనీ సత్యం, భారతి, కూన రవి, నగునూరి రమేష్, బాకం ఆంజనేయులు, చెంచల మురళి, ఆవునూరి రమేష్, బాపురెడ్డి, విష్ణు, రజిత, స్వప్న, సుజాత, రవళి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎం విద్యాసంస్థలపై విద్యార్థి సంఘాల నిరసన



**కరీంనగర్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎస్ఆర్ఎం విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఆరోపిస్తూ, పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్, టౌన్ కార్యదర్శి మొగిలి శివ ఆధ్వర్యంలో కలెక్టర్ చిత్ర మిశ్రాకు వినతిపత్రం అందజేశారు.విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోతే స్వయంగా డబ్బులు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకోవాలని మేనేజ్మెంట్ ఒత్తిడి తెస్తోందని వారు ఆరోపించారు. దీనివల్ల పేద విద్యార్థులు పై చదువులు కొనసాగించలేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని, మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు.ఎస్ఆర్ఎం కళాశాలలో ఉన్న సర్టిఫికెట్లు వెంటనే విద్యార్థులకు అందజేయాలని, మేనేజ్మెంట్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని వారు డిమాండ్ చేశారు.అదేవిధంగా, పేద విద్యార్థులను అడ్మిషన్ తర్వాత ఆర్థికంగా ప్రలోభపెట్టి, తరువాత వేధిస్తున్న ఎస్ఆర్ఎం మేనేజ్మెంట్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని, కళాశాల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులను కలుపుకొని ఎస్ఆర్ఎం కళాశాల ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# దళిత ఎమ్మెల్యే ఇంటిపై దాడి కాంగ్రెస్ ఎస్సీ సెల్ నిరసన



**కరీంనగర్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఇంటిపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు కోడిగుడ్లతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ మరియు దళిత సంఘాల ఆధ్వర్యంలో కోర్టు చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు.జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, సామేలు వ్యాఖ్యలను బీజేపీ వక్రీకరించి కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆయన మాటల్లో ఏ వర్గాన్నీ కించపరచే ఉద్దేశ్యం లేదని, కానీ బండి సంజయ్ వ్యాఖ్యలతో దళిత ప్రజా ప్రతినిధులపై దాడులు జరుగుతున్నాయని అన్నారు.దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరిస్తూ, వెంటనే బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత సంఘాల నేతృత్వంలో పెద్ద ఎత్తున కార్యచరణ చేపట్టి ఆయన ఇంటిని ముట్టడిస్తామని, కరీంనగర్‌లో తిరగనివ్వమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కాదాశి ప్రభాకర్, సముద్రాల అజయ్, సుద్దాల లక్ష్మణ్, మీసాల సాయిలు, గజ్జల ఆనందరావు, తాండ్ర శంకర్ బాబు, వాసాల శ్రీనివాస రావణ్, కనకం విద్యాసాగర్, మనోహర్, ఎర్ర శ్రీనివాస్, గడపల విజయ్ కుమార్, తబలా అంజయ్య, ఆరేపల్లి ఓదేలు, శ్యామ్, భాస్కర్, కోండ్ర స్వరూప, భారతి తదితరులు పాల్గొన్నారు.

# కాల్వల ప్రాజెక్ట్ మత్తడికి మరమ్మత్తులు చేపట్టాలని జాగృతి డిమాండ్



**కరీంనగర్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తామని తెలంగాణ జాగృతి నాయకులు స్పష్టం చేశారు. ఈరోజు జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో మానకొండూర్, హుజురాబాద్ నియోజకవర్గాల రైతులకు ఉపయోగపడే కాల్వల ప్రాజెక్ట్ మత్తడి మూడు సంవత్సరాలుగా మరమ్మత్తులు జరగకపోవడం పై తీవ్ర ఆవేదన వ్యక్తమైంది. జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, శంకరపట్నం, వీణవంక మండలాల పరిధిలోని 15--20 గ్రామాల ప్రజలు ఈ ప్రాజెక్ట్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, కానీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. గత సంవత్సరం జాగృతి జనంబాటలో భాగంగా కవితక్క స్వయంగా ప్రాజెక్ట్ పరిస్థితిని పరిశీలించి హెచ్చరించినప్పటికీ, అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని అన్నారు. రేపు ఎల్.యం.డి కాలనీ ఇరిగేషన్ కార్యాలయం ముందు రైతులతో కలిసి దర్నా చేపట్టి అధికారులకు వినతిపత్రం అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, మహిళ అధ్యక్షురాలు అక్కం శివరాణి, బీసీ విభాగం అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, ఆదివాసి విభాగం అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, సీనియర్ నాయకులు బుడిగె పర్శారం గౌడ్, రంగరవేణి లక్ష్మణ్, బసవేణి రాజేందర్, గర్శకుర్తి విద్యాసాగర్, గాడిచర్ల కొమరయ్య, మహిళా నాయకురాలు జంగ అపర్ణ, యండి సల్మ, బశెట్టి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పురుగుమందుల వాడకంపై అవగాహన ర్యాలీ



**హుస్నాబాద్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని గుజ్జులపల్లి గ్రామంలో రైతులకు పురుగుమందుల వాడకంపై అవగాహన కల్పించేందుకు డబ్ల్యూ డబ్ల్యూఎఫ్--నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో బీసీఐ ప్రాజెక్టు ద్వారా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు పంటలను తరచుగా పరిశీలించి ఆర్థిక నష్టం పరిమితి స్థాయిని దాటినప్పుడు మాత్రమే పురుగుమందులు పిచికారి చేయాలని సూచించారు. స్ప్రే చేసే సమయంలో తప్పనిసరిగా రక్షణ దుస్తులు ధరించాలని, ముఖానికి మాస్క్, తలకు హెల్మెట్, కళ్లకు అద్దాలు, చేతులకు గ్లౌజులు, కాళ్లకు బూట్లు ధరించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎరుపు గుర్తు ఉన్న ప్రమాదకర మందులను వాడకూడదని, పర్యావరణానికి హాని కలిగించే పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ కషాయాలను ఉపయోగించాలని సూచించారు. ఒకేసారి రెండు లేదా మూడు రకాల మందులను కలిపి పిచికారి చేయరాదని, మార్కెట్‌లో రిజిస్టర్ చేయబడిన పెస్టిసైడ్స్ మాత్రమే వాడాలని తెలిపారు. రైతులు తమ పొలాల్లో పని చేసే కూలీలకు కనీస వేతన చట్టం ప్రకారం కూలి చెల్లించాల్సిన బాధ్యత ఉందని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని గుర్తు చేశారు. రైతులు తమ ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీఐ సమన్వయకర్తలు రామారావు, దమయంతి, మమత, జితేందర్ రెడ్డి, సోనీ, రజితతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మక్క కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి డిమాండ్



**జగిత్యాల, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

జిల్లాలో రైతులు పండించిన మక్క పంటకు సంబంధించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈ సంవత్సరం పెద్ద ఎత్తున మక్క పంట పండినప్పటికీ, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ఆలస్యం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మక్కకు కనీస మద్దతు ధర రూ.2400 ప్రకటించినప్పటికీ, కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాల్‌కు రూ.1700--1800 మధ్య తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని తెలిపారు. దీని వల్ల ప్రతి రైతు సగటున రూ.20,000--25,000 వరకు నష్టపోతున్నారని ఎంపీ పేర్కొన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధరకు మక్కను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి, కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి సూచించారు.

## 48 గంటల ధర్నా చేపట్టిన ఆశా వర్కర్లు



కరీంనగర్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు 48 గంటల నిరవధిక ధర్నా చేపట్టారు. ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఫిక్స్ వేతనం రూ.18,000 నిర్ణయం తీసుకోవాలని, ఇతర సమస్యల పరిష్కారం కోసం సరిపడా నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ, మహిళా సాధికారత పేరుతో హామీలు ఇస్తున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం ఆశా వర్కర్లను రోడ్లమీద ధర్నా చేయాల్సిన పరిస్థితికి నెట్టివేసిందని విమర్శించారు. జీతాలు సకాలంలో ఇవ్వకపోవడం, ధర్నా కార్యక్రమాలను అణచివేయడం నియంత పాలనలాంటిదని అన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ళ శ్రీలత మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50 వేల మట్టి ఖర్చులు, ప్రమోషన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రసూతి సెలవులు, ఆదివారం, పండగ సెలవులు, పెండింగ్ పారితోషికాలు, పీఆర్సీ ఏరియర్స్, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీఐటీయు జిల్లా అధ్యక్షులు యు. శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాల్వ సారిక, ఉపాధ్యక్షులు పద్మ, రజిత, సరిత, లత, సహాయ కార్యదర్శులు సుమలత, శ్యామల, సరోజన, లావణ్య, సుమతో పాటు సుమారు 300 మంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సామెల్ వ్యాఖ్యలపై బీజేపీ దళిత మోర్చా మండిపాటు



**కరీంనగర్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఎమ్మెల్యే సామెల్ చేసిన వ్యాఖ్యలను సమర్థించిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు, కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ తీవ్రంగా మండిపడ్డారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వేద బ్రాహ్మణులు ఆశీర్వచనం ఇస్తే సామెల్ అనవసర వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాల్సింది పోయి కవ్వంపల్లి సత్యనారాయణ బీజేపీ, కేంద్రమంత్రి బండి సంజయ్‌పై విమర్శలు చేయడం ఖండనీయమని అన్నారు. దళితులకు గౌరవం ఇచ్చిన పార్టీ బీజేపీ అని, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను గౌరవించిన చరిత్ర కూడా బీజేపీకే ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ మాత్రం కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే పార్టీ అని, ఓ వర్గం మెప్పుకోసం మతాలను ఎత్తుకోవడం, కించపరచడం అలవాటైందని విమర్శించారు. సనాతన ధర్మం, వేద పండితులను కించపరచే హక్కు కాంగ్రెస్‌కు ఎవరు ఇచ్చారని ప్రశ్నిస్తూ, ఎమ్మెల్యే సామెల్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు సమర్థిస్తున్నారా లేక వ్యతిరేకిస్తున్నారా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సోమిడి వేణు ప్రసాద్, పొన్నం మండన్నా, మాసం గణేష్, మ్యాకల వెంకటేష్, జాడి బాలరెడ్డి పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులర్పించిన మేయర్



**కరీంనగర్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు కరీంనగర్‌లో ఘనంగా జరిగాయి. పట్టణ ఆర్య వైశ్య సంఘం, పొట్టి శ్రీరాములు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మేయర్, ఆయన త్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి దేశంలో భాషా ప్రాతిపదిక రాష్ట్రాల ఏర్పాటు సాధ్యమైందని పేర్కొన్నారు. గాంధీ పిలుపు మేరకు ఉద్యోగాన్ని వదిలి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ఉప్పు సత్యాగ్రహం, దండి యాత్ర, సభర్మతి ఆశ్రమంలో సేవలందించిన ఆయన నిజమైన గాంధీయవాది అని కొనియాడారు. నెల్లూరులో హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించేందుకు నిరాహార దీక్ష చేసి విజయం సాధించిన పొట్టి శ్రీరాములు జీవితం అందరికీ ఆదర్శమని మేయర్ అన్నారు. విగ్రహం వద్ద అభివృద్ధి పనులు చేపడతానని కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బండారు రమణ రెడ్డి, నగనూర్ రాజేందర్, ఉప్పల రామేశం, చిదుర సురేష్, కన్న కృష్ణ, గుండ చంద్రమౌళి, రాచమళ్ళ ఆంజనేయులు, బండ సత్తయ్య, రావికంటి భాగ్యలక్ష్మి, సుద్దాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రైండర్ యాప్ ద్వారా మోసాలకు పాల్పడిన నిందితులు అరెస్ట్



**కరీంనగర్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

గ్రైండర్ యాప్ ద్వారా పరిచయం ఏర్పరచుకుని హోమోసెక్స్ పేరుతో పిలిచి, దాడి చేసి డబ్బులు, మొబైల్ ఫోన్ లాక్కున్న ముగ్గురు నిందితులను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఫిర్యాదుదారు రమిల్లా కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఏ. నిరంజన్ రెడ్డి కేసు నమోదు చేసి, ఏసీపీ విజయ్ కుమార్ ఆదేశాలపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. దర్యాప్తులో భాగంగా తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితుల వద్ద నుండి రూ.1,500 నగదు, ఫిర్యాదుదారుని మొబైల్ ఫోన్, మూడు ఇతర మొబైల్ ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఒక మైనర్ బాలుడు సహా ముగ్గురిని కోర్టులో రిమాండ్‌కు ప్రవేశపెట్టారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించినందుకు కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌష్ ఆలం, ఏసీపీ విజయ్ కుమార్ సీఐ నిరంజన్ రెడ్డి మరియు బృందాన్ని అభినందించి నగదు బహుమతులు ప్రకటించారు. ఏసీపీ యువకులు మొబైల్ ఫోన్లలో సెక్సువల్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసి మోసపోవద్దని హెచ్చరించారు. అటువంటి యాప్‌ల ద్వారా ఇతరులకు సమాచారం పంపితే చట్టరీత్యా నేరమని, కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


## శ్రీ గంగమ్మ తల్లి జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి, కాల్వపల్లి గ్రామాలలో సోమవారం నిర్వహించిన శ్రీ గంగమ్మ తల్లి జాతర మహోత్సవంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో సర్పంచులు, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు తదితరులు హాజరై జాతర మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిందని బీజేపీ ఆరోపణ





**కరీంనగర్/గంభీరావుపేట/హుజురాబాద్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, 1000 రోజులు గడిచినా అమలు చేయలేని దుస్థితిలో ఉందని కరీంనగర్ బీజేపీ జోన్ నేతలు మండిపడ్డారు.సోమవారం కరీంనగర్ ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్, సెంట్రల్ జోన్‌ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు.బీజేపీ జోన్ అధ్యక్షులు జాడి బాల్ రెడ్డి, తణుకు సాయి కృష్ణ, పాదం శివరాజ్, బండారి గాయత్రి, అవదుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2500, రూ.500కు గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, రుణమాఫీ, యువ వికాసం, పెన్షన్లు, ఇండ్ల స్థలాలు, గృహజ్యోతి వంటి హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు.రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల విషయంలో ప్రజలను తీవ్రంగా మోసం చేసిందని, వెంటనే అమలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జా శ్రీనివాస్ రావు, కార్పొరేటర్లు బండా రమణ రెడ్డి, ఒంటెల సత్యనారాయణ రెడ్డి, సోమిడి వేణు, మేకల వెంకటేష్, మాసం గణేష్, వరాల జ్యోతి, బండి ప్రశాంత్, నాంపల్లి శ్రీనివాస్, దేవసాని సత్యం, పొన్నం మొండయ్య, పెద్దపల్లి జితేందర్, రాగి సత్యనారాయణ, కదర్ల విమల్ కుమార్, అన్నాజీ వినీత్ కుమార్, ఉప్పరపల్లి శ్రీనివాస్, మంగళ రవిగోపాల్, దెయ్యాల మల్లేశం, విష్ణు ప్రసాద్ రావు, కేశవ రెడ్డి, పాశం తిరుపతి, పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ ఏజెన్సీ మాయాజాలం

### -- 300 సిలిండర్లు మాయం



**అమ్రాబాద్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో గ్యాస్ సరఫరాలో భారీ గోల్మాల్ బయటపడింది. తహసీల్దార్ సైదులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో లక్ష్మీ ప్రసన్న గ్యాస్ ఏజెన్సీలో రికార్డులు, గోదాం లెక్కలు సరిపోకపోవడం వెలుగులోకి వచ్చింది. తనిఖీల్లో గోదాంలో ఉండవలసిన సుమారు 300 గ్యాస్ సిలిండర్లు మాయం కావడం అధికారులను ఆశ్చర్యానికి గురి చేసింది. సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలించిన అవకాశముందని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు.సామాన్య ప్రజలకు అందవలసిన గ్యాస్‌ను అక్రమంగా మళ్లించడం వల్ల కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నం జరిగినట్లు భావిస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సైదులు మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల అనంతరం గ్యాస్ ఏజెన్సీ కార్యకలాపాలపై పూర్తి నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ ఘటన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ప్రజలు ఇలాంటి దాడులు తరచుగా జరగాలని, అప్పుడే ఏజెన్సీల అక్రమాలు అదుపులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు.

# గాయపడ్డ జర్నలిస్టు నాగేష్ కు ఇబ్రహీంపట్నం సీఐ ఆర్థిక సహాయం.


**ఇబ్రహీంపట్నం మార్చి 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**



ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బిగ్ టివి రిపోర్టర్ ముచ్చర్ల నాగేష్ ఇటీవల న్యూస్ కవరేజ్ కోసం వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. నిరుపేద కుటుంబానికి చెందిన నాగేష్ పరిస్థితిని గూర్చి టియుడబ్ల్యూజే (హెచ్ 143) యూనియన్ నాయకుల విజ్ఞప్తి మేరకు పరిస్థితిని అర్థం చేసుకున్న ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి మానవ దృక్పథంతో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలోని లిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రిపోర్టర్ నాగేష్ ను పరామర్శించి ఆయనకు 25,000/- రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, టీయూడబ్ల్యూజే (హెచ్ 143) నియోజకవర్గ అధ్యక్షులు సురమోని సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి చెరుకూరి రాజు, సురమోని బాబు, హనుమంతు సుదర్శన్, మొలుగు శ్రీను, కిషన్, గోవర్ధన్, సైదులు ఇతర యూనియన్ సభ్యులు పి.వెంకటేష్ పి.క్రాంతి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సీఐటీయూ ధర్నా

**కరీంనగర్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా జరిగింది. కార్మికుల కార్డులు రెన్యువల్, పెండింగ్ క్లెయిమ్స్‌కు నిధులు విడుదల చేయాలని, వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించిన జీఓ నెం. 12ను సవరించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం లేబర్ ఆఫీస్ ఇన్‌చార్జి మనోజ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ, వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రైవేట్ కంపెనీలకు బదిలీ చేయడం అన్యాయమని, 13 లక్షల కార్మికుల కార్డులు రెన్యువల్ చేయకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కార్మికులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాలు, సంక్షేమ పథకాలు సకాలంలో అందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని అన్నారు.ప్రస్తుతం అమలులో ఉన్న 12 స్కీముల్లో 3 మాత్రమే ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించి, మిగతా స్కీములు కార్మికులకు అందకుండా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. హెల్త్ టెస్టుల




పేరుతో సిఎస్సి సంస్థకు వందల కోట్లు మళ్లించడం దోపిడీ అని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే జీఓ నెం. 12ను సవరించి, వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని, పెండింగ్ క్లెయిమ్స్‌కు నిధులు విడుదల చేయాలని, రెన్యువల్ కాని కార్మికుల కార్డులను యుద్ధప్రాతిపదికన రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 30వ తేదీన ఛలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.ఈ ధర్నాలో జిల్లా అధ్యక్షులు కదిరే రమేష్, కోశాధికారి వట్టి జగదీష్, ఉపాధ్యక్షులు జంబుకం వెంకన్న, పల్ల తిరుపతి, మల్లారెడ్డి, సహాయ కార్యదర్శి రావుల ఎల్లయ్య, ఇజ్జగిరి సుధాకర్, ఇమ్మడి చక్రపాణి, నాయకులు ఎగిత రమేష్, ముడిమడుగుల మల్లేశం, పాతూరి లింగారెడ్డి, జంబుకం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువత ఉపాధి సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావన

**వరంగల్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వరంగల్ జిల్లాలో పరిశ్రమల కొరత, ఉపాధి అవకాశాల లోపం కారణంగా యువత హైదరాబాద్ సహా ఇతర మహానగరాలకు వలసలు వెళ్తున్నారని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పార్లమెంట్‌లో ప్రస్తావించారు.15--29 ఏళ్ల మధ్య యువతలో నిరుద్యోగం ఎంత మేర ఉందో, వలసలను తగ్గించేందుకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటోందో వివరించాలని ఆమె కేంద్రాన్ని కోరారు. అలాగే వ్యవసాయ పనులు లేని ఆఫ్ సీజన్‌లో సీజనల్ కూలీలకు ఆదాయం, భద్రత కల్పించేందుకు ప్రత్యేక పథకాలు ఉన్నాయా అని ప్రశ్నించారు.కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే సమాధానమిస్తూ, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే గణాంకాల ప్రకారం తెలంగాణలో యువత నిరుద్యోగం 2017--18లో 23.3% ఉండగా 2023--24 నాటికి 16.6%కి



తగ్గిందని తెలిపారు. వర్కర్ పాప్యులేషన్ రేషియో 32% నుంచి 40.7%కి పెరిగిందని, దేశవ్యాప్తంగా కూడా నిరుద్యోగం 17.8% నుంచి 10.2%కి తగ్గిందని వివరించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ ఇండియా మిషన్, ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన, నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్, ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అయితే సాధారణ పథకాలతో వరంగల్ ప్రాంతంలోని ప్రత్యేక సమస్యలు పరిష్కారం కావడం లేదని ఎంపీ కడియం కావ్య అభిప్రాయపడ్డారు. పరిశ్రమల కొరత, వ్యవసాయ ఆధారిత ఉపాధి సీజనల్‌గా ఉండటం వల్ల యువత వలసలు ఆగడం లేదని పేర్కొన్నారు. వరంగల్ ప్రాంతానికి ప్రత్యేక పరిశ్రమలు, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచే విధంగా కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# మత్స్యకారులకు కేంద్ర పథకం ప్రయోజనాలు

**కరీంనగర్ రూరల్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ముదిరాజులు, బెస్త, చేపల విక్రయదారులు, ఆక్వా రైతులకు ప్రయోజనకరంగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ-యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని సిఎస్‌సి వి ఎల్ ఈ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేముల అనిల్ కుమార్ తెలిపారు. మల్కాపూర్‌లోని సిఎస్‌సి సెంటర్‌లో మత్స్యకారులకు ధ్రువీకరణ పత్రాలను అందించే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు, ఇన్సూరెన్స్, సబ్సిడీలు, శిక్షణ వంటి సౌకర్యాలు లభిస్తాయని చెప్పారు.



అలాగే ఎన్‌ఎఫ్డిపి డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా చేపల క్రయవిక్రయాలు, మార్కెట్ రిజిస్ట్రేషన్, ఇ-వేలం, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించబడతాయని వివరించారు. దీని ద్వారా ముదిరాజులు, బెస్త, చేపల విక్రయదారులు ఆర్థికంగా ఎదగడానికి, వారి వ్యాపారాన్ని అభివృద్ధి పరుచుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులు దగ్గరలోని సిఎస్‌సి సెంటర్‌లో తమ పేర్లను నమోదు చేసుకుని ధ్రువీకరణ పత్రాలు పొందాలని సూచించారు. ఈ పథకాన్ని తీసుకువచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కల్వకుర్తి బస్టాండులో అంబలి కేంద్రం ప్రారంభం

**కల్వకుర్తి, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి పట్టణ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికుల ప్రాంగణంలో అంబలి కేంద్రం, చలివేంద్రాన్ని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్‌చైర్మన్ ఉప్పల వెంకటేష్ సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో దూర ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులకు దాహార్తిని తీర్చడంలో అంబలి కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలకు సేవ చేయడం, వారి అవసరాలను తీర్చడం సమాజానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాపిశెట్టి రాము, గంప వెంకటేష్, గంధం ప్రసాద్, దాచేపల్లి శ్రీనివాసులు, సూర్యప్రకాశ్ రావు, భావండ్ల మధు, మనోహర్ రెడ్డి, దారమోని గణేష్, పూరి రమేష్, సుశీల, ఈశ్వరయ్య, వెంకటయ్య, పోల నరేష్, శివ, నరసింహ, శ్రీనివాసులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు,



కల్వకుర్తి మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలలో - యువత మత్తు - భవిష్యత్తు చిత్తు



కళాశాల పరీక్షలు ముగిశాయి, యువతకు రెక్కలు వచ్చాయి.
యుక్తవయస్సు, ఉడుకురక్తం, పైన ఇది జెన్-జీ (+వల్గ్-) జనరేషన్.
జల్సాల కోసం, సరదాకోసం తప్పుడు దారులు.
మంచి,చెడు ఆలోచించలేని వయస్సు.
ఈ జనరేషన్‌కి తక్కువ సమయంలోనే అంతులేని ఆనందం పొందాలి - దానికోసం మాదకద్రవ్యాల (డ్రగ్స్) మత్తు దారి ఎంచుకొని...
జీవితం మత్తు.... భవిష్యత్తు చిత్తు చేసుకోకు యువతరమా...
క్షణికానందం కోసం నువ్వువేసే అడుగు, నీ జీవితాన్ని పాతాళానికి తొక్కే ఉరితాడు
వ్యసనమనే గొలుసులను తెంచుకో, బంగారు భవిష్యత్తు నిర్మించుకో.
ఓ యువతా... జీవం నీది, జీవితం నీది....

అవ్వుసలి విజయ్ కుమార్
తెలుగు ఉపాధ్యాయుడు
9640225383



# కాంగ్రెస్ 6 గ్యారెంటీలపై బీజేపీ నిరసన

**కరీంనగర్ రూరల్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, రెండున్నర ఏళ్లు గడిచినా అమలు చేయలేక ప్రజలను మోసం చేసిందని బీజేపీ మండల అధ్యక్షుడు కుంట తిరుపతి తీవ్రంగా విమర్శించారు.బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కొత్తపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి మాట్లాడుతూ, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2500, రూ.500కు గ్యాస్ సిలిండర్ హామీ అమలు కాలేదని, రైతు భరోసా, రుణమాఫీ, యువ వికాసం, విద్యా భరోసా, పెన్షన్లు, గృహజ్యోతి వంటి పథకాలు తూతూ మంత్రంగా మారాయని విమర్శించారు.ఎన్నికల సమయంలో రైతులకు రూ.15,000 భరోసా ఇస్తామని చెప్పి, రూ.12,000కు కుదించి రైతాంగాన్ని మోసం చేశారని, పెన్షన్లు రూ.4000 ఇస్తామని చెప్పి అమలు చేయలేకపోయారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యమకారులకు స్థలాలు, ఉచిత విద్యుత్ వంటి హామీలు కూడా అమలు కాలేదని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు కోమటిరెడ్డి అంజన్ కుమార్, నునుగొండ మానస ప్రవీణ్, ఉప సర్పంచులు ఆరె నరేష్ గౌడ్, కట్ల వెంకటేష్, బీజేపీ నాయకులు గుంజేటి శివకుమార్, కెంచ శేఖర్, సోమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, జవ్వాజి రమేష్, వేముల అనిల్ కుమార్, సోమినేని కర్ణాకర్, పోర్తి అనిల్, కోప్పుల హరిప్రసాద్, ప్రదీప్, సురేష్, రవి తదితరులతో పాటు గ్రామాల వార్డ్ మెంబర్లు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు..






**యాచారం , మార్చి 16( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా సోమవారం యాచారం మండల కేంద్రంలో ౹ా=+ ఫౌండేషన్ అధ్యక్షులు రవీందర్ గుప్త ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద గాంధీ విగ్రహనికి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంద్భంగా రవీందర్ గుప్త మాట్లాడుతూ ... పొట్టి శ్రీరాములు మహాత్మా గాంధీ ఆలోచనలకు ప్రేరణగా పనిచేసిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని తెలిపారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా సమాజంలో సమానత్వం నెలకొల్పాలనే సంకల్పంతో ఆయన జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన 58 రోజుల పాటు అమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన విషయం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఆయన త్యాగం ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని గుర్తు చేశారు. మరియు రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు విషంషెట్టి సంతోష్ గుప్త , మాట్లాడుతూ.. మహానుభావుడు, త్యాగశీలి అమరజీవి పొట్టి శ్రీరాములు అని అన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగం, స్ఫూర్తి యావత్ తెలుగు జాతికి ఆదర్శమని తెలిపారు. 58 రోజుల కఠోర ఉపవాస దీక్ష అనంతరం పొట్టి శ్రీరాములు తుది శ్వాస విడిచారన్నారు.అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ అని చెప్పుకొచ్చారు. తెలుగు ప్రజల కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా వదిలిన మహానీయుడు పొట్టి శ్రీరాములు అని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు నాళ్ళ మురళీకృష్ణ, ప్రొద్దుటూరి. సురేందర్ గుప్త , రామాచారి, మహేష్ ,రాజు తదితరులు పాల్గొన్నారు.

# శాసనసభ్యుల మీద చర్యలు తీసుకోవాలి

-తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరి రాము
- తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య డిమాండ్



**వరంగల్,మార్చి 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తుంగతుర్తి శాసనసభ్యులు సామెల్,మానకొండూరు శాసనసభ్యులు సత్యనారాయణ ల మీద చర్యలు తీసుకోవాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తుంగతుర్తి శాసనసభ్యులు సామెల్ బ్రాహ్మణులు చదివే వేధ మంత్రాల అర్ధం నాకు తెలువదు అని పరుషపదజాలాలు వాడి బ్రాహ్మణులు చదివే వేధ ఆశీర్వచన మంత్రాలు ఇవ్వే ఏమోనని మాట్లాడడం అర్ధరహితం అన్నారు.మీకు అర్ధం కాకుంటే అడగండి మీకు బ్రాహ్మణులు వివరిస్తారు. వీరి మాటలను సమర్ధిస్తు మానకొండూరు శాసనసభ్యులు సత్యనారాయణ యావత్ బ్రాహ్మణకులాన్ని ఒక పార్టీకి అనుసందించడం సరైన పద్దతి కాదని వెంటనే ఈ ఇరువురి మీద ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రత్యేక వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

**ఎలిగేడు, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 18వ తేదీ బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి నిస్సి క్రిస్టిన తెలిపారు.ఈ శిబిరంలో స్త్రీలు, పిల్లల వైద్య నిపుణులు, కంటి, పంటి, ఎముకల వైద్య నిపుణులు ప్రజలకు సాధారణ వైద్య సేవలు అందించనున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.




# చికిత్స పొందుతూ యువతి మృతి



**తెలకపల్లి, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలకపల్లి మండలంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. గోలగుండం గ్రామానికి చెందిన వడ్డేమాన్ భార్గవి (21) అనే యువతి చికిత్స పొందుతూ మృతి చెందింది.స్థానిక ఎస్సై బి. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 15న భార్గవి తండ్రి ఆమె వివాహ నిశ్చయం కోసం తెలకపల్లి మండల కేంద్రానికి చేరుకోగా, అదే రోజు సాయంత్రం భార్గవి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గ్రామానికి చెందిన కడెం శివ ఈ విషయాన్ని గమనించి ఆమె తండ్రికి సమాచారం ఇవ్వడంతో వెంటనే భార్గవిని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.భార్గవికి లింగాల మండలం కోమటికుంట గ్రామానికి చెందిన కడెం బాలకృష్ణతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని మృతురాలి తండ్రి వడ్డేమాన్ పాపయ్య అనుమానం వ్యక్తం చేసి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై బి. నరేష్ వెల్లడించారు.

# కేజీబీవీ చౌదర్‌గూడలో 'గణితం --ప్రేరణ' అవగాహన సదస్సు



**చౌదర్‌గూడ, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చౌదర్‌గూడ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం "గణితం--ప్రేరణ" అవగాహన సదస్సు ఘనంగా జరిగింది. విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే ఈ కార్యక్రమం లక్ష్యంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రముఖ గణిత నిపుణులు పాండు రంగయ్య విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. గణితం అంటే భయం కాదు, అది ఒక ఆట అని, సరైన పద్ధతుల్లో నేర్చుకుంటే అత్యంత ఆసక్తికరమైన సబ్జెక్టు అవుతుందని ఆయన వివరించారు. క్లిష్టమైన లెక్కలను సులభంగా సాధించే పద్ధతులను ప్రత్యక్షంగా చూపించి విద్యార్థులను ఆకట్టుకున్నారు. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదవాలని ఆయన విద్యార్థులను ఉత్సాహపరిచారు.విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని ఎలా జయించాలో ఆయన వివరించిన తీరు విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.పాఠశాల ప్రత్యేక అధికారి మరియు ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ, పాండు రంగయ్య వంటి నిపుణుల సలహాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయని, వారి భవిష్యత్తుకు ఇవి పునాదులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

-2026-27 సంవత్సరం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో రూ.5000 కోట్లు కేటాయించాలి
-పెన్షన్‌ను రూ. 2000 నుంచి రూ.4000కు పెంచాలి
-ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచాలి
-ప్రభుత్వం హామీలు నెరవేర్చడంలో నిర్లక్ష్యం చేస్తే.. అసెంబ్లీని ముట్టడిస్తాం



**వరంగల్, మార్చి 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో గౌడ సామాజిక వర్గానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని
వరంగల్ జిల్లా కల్లుగీత కార్మిక సంఘ అధ్యక్షుడు తాళ్ల పెల్లి నరసయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వీరస్వామి గౌడ్,జిల్లా గౌరవ సలహాదారుడు సట్ల సూరయ్య గౌడ్ డిమాండ్ చేశారు.సోమవారం కల్లుగీత కార్మికుల సంఘం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుని గౌడుల జీవన ప్రమాణాలను పెంచాలని కోరుతూ వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కల్లుగీత కార్మిక సంఘ అధ్యక్షుడు తాళ్ల పెల్లి నరసయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వీరస్వామి గౌడ్,జిల్లా గౌరవ సలహాదారుడు సట్ల సూరయ్య గౌడ్ మాట్లాడుతూ
ఈ సంవత్సరం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో రూ.5000 కోట్లు కేటాయించి గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ గీత కార్మికులకు అనేక హామీలు ఇచ్చిందని గుర్తుచేస్తూ, పెన్షన్‌ను రూ. 2000 నుంచి రూ.4000కు పెంచాలని, ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచాడం తో పాటు ప్రమాదవశాత్తు చనిపోయిన గీత కార్మికుల కుటుంబాలకు సకాలంలో ఎక్స్ గ్రేషియా అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో నిర్లక్ష్యం చేస్తే కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అసెంబ్లీని ముట్టడించాలని కూడా వెనకాడ భూమిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కల్లుగీత కార్మిక సంఘ అధ్యక్షుడు తాళ్ల పెల్లి నరసయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వీరస్వామి గౌడ్,జిల్లా గౌరవ సలహాదారుడు సట్ల సూరయ్య గౌడ్,మండల కమిటీ జనగం యాదయ్య గౌడ్, బండి సతీష్ గౌడ్,సట్ల నరసింహులు గౌడ్,బూర సంపత్ గౌడ్, మడ్డి సుధాకర్ గౌడ్,ప్రశాంత్ గౌడ్,లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

- దేవరశెట్టి సత్యనారాయణ



**సూర్యాపేట, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
"పేద ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం నా వంతు కృషి చేస్తాను. ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా" అని సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుడు దేవరశెట్టి సత్యనారాయణ సోమవారం తెలిపారు.గత 16 సంవత్సరాలుగా ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానని, త్వరలో జరగబోయే సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు.గతంలో క్రీస్తు శేషులు మీలా సత్యనారాయణ, మొరిశెట్టి సత్యనారాయణ, ఉప్పల రామమూర్తి వంటి నాయకులు పోటీ చేయాలని భావించినప్పటికీ, ప్రతిసారి ఇతరులకు అవకాశం ఇచ్చారని గుర్తుచేశారు. ఈసారి పట్టణ ఎన్నికల్లో ఏకగ్రీవంగా తనను ఎన్నుకునేలా ఆర్యవైశ్య ప్రముఖులు కృషి చేయాలని కోరారు.ఇప్పటివరకు సుమారు 300 మంది పేద ఆర్యవైశ్యుల వివాహాల కోసం సహాయ సహకారాలు అందించానని, 200 మంది పేద ఆర్యవైశ్యులు మరణించిన సందర్భాల్లో వారి దహన సంస్కారాల్లో పాల్గొని ఆర్థిక, శారీరక సహాయం చేశానని తెలిపారు. "ఆర్యవైశ్యుల అవసరాలకు 24 గంటలు అందుబాటులో ఉంటూ నా వంతు కృషి చేస్తాను" అని దేవరశెట్టి సత్యనారాయణ స్పష్టం చేశారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 30% నిధులు కేటాయించాలి

-ఎస్ఎఫ్ఐ.




**దేవరకొండ మార్చి 16. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్ర సమావేశ నిర్వహించడం జరిగింది .ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ, ఈ నెల 20వతేదీన అసెంబ్లీలో ప్రవేశ పెట్టె రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలని అన్నారు. విద్య అనేది సమాజ అభివృద్ధికి, దేశ భవిష్యత్తుకు మూలస్తంభం అయినప్పటికీ ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు.రాష్ట్రంలో పాఠశాలల నుంచి యూనివర్సిటీల వరకు మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని,అనేక విద్యాసంస్థల్లో భవనాలు, తరగతి గదులు, ల్యాబొరేటరీలు, లైబ్రరీలు, హాస్టళ్లు సరిపడా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ఉపాధ్యాయుల పోస్టులు భారీగా ఖాళీగా ఉండటంతో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని అన్నారు.ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన ఫీజురీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్ బకాయిలు 8,500 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇవి వెంటనే విడుదల చేయాలని,వాటిని బడ్జెట్లో చేర్చి తక్షణం బకాయిలు విడుదల చేయాలని, వీటిపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశారు.ప్రభుత్వం విద్యను వ్యయంగా కాకుండా పెట్టుబడిగా భావించి రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలి అని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందన్నారు.గత బడ్జెట్‌లో విద్యకు కేవలం 7.56 శాతం నిధులు మాత్రమే కేటాయించడం వల్ల యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాల కొరత,సిబ్బంది కొరత,హాస్టల్ సమస్యలు పెరిగిపోయాయని ఎస్ఎఫ్ఐ తెలిపింది.ఈ సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం విద్యార్థులపై అదనపు భారం మోపడం సరైనది కాదన్నారు అదేవిధంగా యూనివర్సిటీల్లో టీచింగ్ పోస్టులు భారీగా ఖాళీగా ఉన్నాయని,వాటిని తక్షణమే భర్తీ చేయాలని కోరింది.రాబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సంఘటితం చేసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మోర రోహన్,నాగిళ్ల కార్తీక్, ఆంబోతు గణేష్ ,ముసుకు గణేష్ , ముదిగొండ రాఖిల్ ,ఉరే లక్ష్మీ ప్రశాంత్,మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# కందివనం ఆంజనేయ స్వామి దేవాలయానికి అంజయ్య యాదవ్ సహాయం



**ఫరూఖ్‌నగర్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఫరూఖ్‌నగర్ మండలం కందివనం గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో మిగిలి ఉన్న నిర్మాణ పనుల పూర్తి కోసం మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ రూ.50,000 ఆర్థిక సహకారం అందించారు.గ్రామ ప్రజలు, దేవాలయ కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు ఈ సహాయాన్ని అందజేసిన ఆయన మాట్లాడుతూ, "ఆలయ అభివృద్ధి గ్రామ అభివృద్ధికి సంకేతం" అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, భక్తులు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.

# నేషనల్ లెవెల్ కుంగ్ ఫు పోటీల్లో న్యూ పవర్ అకాడమీ విద్యార్థుల ఘన విజయం



**షాద్‌నగర్, మార్చి 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
షాద్‌నగర్ పట్టణంలోని ఠాగూర్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన నేషనల్ లెవెల్ ఓపెన్ కుంగ్ ఫు--కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికేట్లు కైవసం చేసుకున్నారు.అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ పర్యవేక్షణలో శిక్షణ పొందిన విద్యార్థులు తమ విన్యాసాలతో అందరినీ ఆకట్టుకున్నారు. కుంగ్ ఫు మాస్టర్ బాలరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు వివిధ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుంగ్ ఫు గ్రాండ్ మాస్టర్ వీరాచారి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.న్యూ పవర్ అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రేమ్‌కుమార్, రాహుల్ ఫైట్ విభాగాల్లో అగ్రస్థానంలో నిలిచి ట్రోఫీలను సొంతం చేసుకున్నారు. వీరితో పాటు మరికొందరు చిన్నారులు కూడా మెరుగైన ప్రదర్శన ఇచ్చి మెడల్స్, ప్రశంసా పత్రాలను అందుకున్నారు.విద్యార్థుల ప్రతిభపై మాస్టర్ అహ్మద్ ఖాన్ హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# నందిని సిధారెడ్డి కి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం




**హైదరాబాద్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు, ప్రముఖ కవి, రచయిత, ఉద్యమకారుడు నందిని సిధారెడ్డి గారు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకోవడం సాహితీ లోకంలో ఆనందాన్ని నింపింది. ఆయన రాసిన 'అనిమేష' కవితా సంపుటికి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు లభించింది.మెదక్ జిల్లాలో జన్మించిన నందిని సిధారెడ్డి తన కవిత్వం, పాటల ద్వారా తెలంగాణ అస్తిత్వాన్ని, ఉద్యమ ఉధృతిని ప్రతిబింబించారు. 'నాగేటి సాల్లళ్ల నా తెలంగాణ' వంటి పాటలతో ప్రజల్లో ఆత్మగౌరవాన్ని నింపారు. ఉద్యమంలో ఆయన రచనలు ప్రజలకు ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కలిగించాయి.'అనిమేష' కవితా సంపుటి కరోనా కాలంలోని సామాజిక, ఆర్థిక, మానవ సంబంధ సమస్యలను హృద్యంగా చిత్రీకరించింది. వలస కూలీల కష్టాలు, ఒంటరితనం, మానవ సంబంధాల విచ్ఛిన్నతను ఆయన కవిత్వం కళ్లకు కట్టినట్లు చూపించింది.నందిని సిధారెడ్డి ఇప్పటివరకు అనేక కవితా సంపుటాలు, గేయాలు, కథలు, సిద్ధాంత గ్రంథాలు రచించారు. భూమిస్వప్నం, ప్రాణహిత, ఒక బాధ కాదు, నది పుట్టుబడి, ఇగురం, ఆవర్ధనం, చిత్రకన్ను వంటి రచనలు ఆయన సాహిత్య ప్రతిభకు నిదర్శనాలు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా ఆయన చేసిన సేవలు విశేషం. ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు అనేక గ్రంథాలను వెలుగులోకి తెచ్చారు.నందిని సిధారెడ్డి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకోవడం తెలంగాణ సాహిత్యానికి గౌరవకారణమని సాహితీ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.ఈ సందర్భంగా సమైక్య సాహితీ ప్రతినిధులు మాడిశెట్టి గోపాల్, అనంతాచార్య, డా. బివిఎన్ స్వామి, తేనియలు ప్రక్రియ రూపకర్త విజయప్రసాద్ నలుమాసు తదితరులు అభినందనలు తెలిపారు.

# తాటిపర్తి ఉచిత వైద్య శిబిరం విజయవంతం

- సర్పంచ్ నీలం ఝూన్సీ రమేష్



**యాచారం , మార్చి 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: యాచారం మండల పరిధిలోని తాటిపర్తి గ్రామ పంచాయతీ వద్ద, హైదరాబాద్ ఎల్. బి. నగర్ లోని ఓ ప్రైవేట్ హాస్పటల్ సహకారంతో తాటిపర్తి గ్రామ సర్పంచ్ నీలం ఝూన్సీ రమేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరం సర్పంచ్ నీలం ఝూన్సీ రమేష్ ప్రారంభించారు. బీపీ, షుగర్ మరియు కంటికి సంబందించిన పరీక్షలు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# "ఇక సహించదు తెలంగాణ" అంటూ కాంగ్రెస్ పాలనపై బీజేపీ పోరుబాట



**నాగర్‌కర్నూల్, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కాని పరిస్థితిపై బీజేపీ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. "ఇక సహించదు తెలంగాణ -- సేవ్ తెలంగాణ" నినాదంతో బీజేపీ పోరుబాట ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా నాగర్‌కర్నూల్ టౌన్ అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం వద్ద డిటిఓ విశ్వనాథ్‌కు మెమోరాండం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో పెన్షన్, ఫీజు రీయింబర్స్మెంట్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతుబంధు వంటి పథకాలు అమలు కాలేదని వారు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయకపోవడం ద్వారా ప్రజలను మోసం చేసిందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. హామీలు అమలు కాని ఎడల పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ జనరల్ సెక్రటరీ వారధి శీను, కిసాన్ మోర్చా కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, వంగ శ్రీనాథ్ గౌడ్, సీనియర్ నాయకులు సూర్యనారాయణ, శ్రీనివాసులు, గణేష్, దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీపీఎస్ శేరిగూడ విద్యార్థులకు వనభోజనాలు

**ఇబ్రహీంపట్నం, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఎంపీపీఎస్ శేరిగూడ పాఠశాల విద్యార్థులకు వనభోజనాలు ఏర్పాటు చేసి అలోహ ఫార్మ్ యజమాని మన్నెం హనుమంత్‌రెడ్డి సమాజసేవకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో విద్యార్థులను గ్రామ సమీపంలోని అలోహ ఫార్మ్‌కు తీసుకెళ్లి వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నెం హనుమంత్‌రెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ "ఉపాధ్యాయ వృత్తి అన్నింటికంటే గొప్పది. గురువులను పూజించే సమాజం ఎల్లప్పుడూ సుఖశాంతులతో ఉంటుంది" అని పేర్కొన్నారు. పచ్చని ప్రకృతి మధ్య చిన్నారి విద్యార్థులు ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్‌ఎస్ శేరిగూడ పాఠశాల జిహెచ్‌ఎం శ్రీనివాసులు, తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ్, మండల అధ్యక్షుడు వడ్ల రాజేందర్, తపస్ బాధ్యులు ఆంజనేయులు, మహేష్, ట్రైనీ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అందరూ కలిసి మన్నెం హనుమంత్‌రెడ్డిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి

-పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి.
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్.



**దేవరకొండ మార్చి 16. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల పొట్టగొట్టే వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్య లు కంబాలపల్లి ఆనంద్ కోరారు.

సోమవారం రోజున దేవరకొండ మండలంలోని కమలాపురం గ్రామం లో ఉపాధి హామీ కూలీల సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ యూపీఏ వన్ హాయంలో సామాజిక భద్రత, వలసల నివారణలో భాగంగా, కమ్యూనిస్టు పార్టీలు పోరాడి సాధించిన జాతీయ ఉపాధి ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి విబిజి రాంజీ పథకం పేరుతో ఉపాధి కూలీల పొట్టగొట్టే చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ చట్టానికి వ్యతిరేకంగా వ్యవసాయ కూలీలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉపాధి కూలీలకు పని ప్రాంతాల్లో కనీసం మంచినీటి సౌకర్యం కల్పించకపోవడం శోచనీయమన్నారు.
ప్రథమ చికిత్స కిట్లులు లేకుండా, టెంట్లులేకుండా వ్యవసాయ కూలీలతో పనులు చేయించుకుంటున్నారన్నారు. ఐరిష్ పేరుతో నానా రకాలుగా ఉపాధి కూలీలు ఇబ్బంది పడుతున్నారు అన్నారు. మూడు నాలుగు గంటలు పని చేసిన తర్వాత ఐరిష్ రాకుంటే ఉపాధి కూలీలను ఇంటికి పంపుతున్నారని, ప్రత్యామ్నాయ మార్గాలు లేకుండా పని చేసిన తర్వాత కూడా ఇంటికి పంపడం చాలా దుర్మార్గం అన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు పని చేస్తున్నప్పటికీ కూలి గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు వారాలుగా పనిచేసిన డబ్బులు ప్రభుత్వం ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు. పని మొదలుపెట్టినప్పుడు, ముగిసిన తర్వాత రెండు సార్లు ఫోటోలు తీయడం వల్ల కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాఫ్ట్వేర్ ప్రాబ్లం తో ఫోటోలు మ్యాచ్ కాకపోవడం వల్ల కార్మికులు పని నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా కొత్తగా పని కార్డు కోసం అప్లై చేస్తున్న వారికి జాబ్ కార్డు ఇవ్వడం లేదని కేవలం ఇందిరమ్మ ఇండ్ల సాంక్షన్ అయిన వారికి మాత్రమే ఇస్తామని సమాధానం చెబుతున్నారని, ఇది కార్మికుల పొట్ట కొట్టడమేనని అన్నారు. గత పది సంవత్సరాలుగా గడ్డపారలు, పారులు, తట్టలు లాంటి పనిముట్లు ఇవ్వడం లేదని వెంటనే వాటిని ఇవ్వాలని పని అడిగిన వెంటనే పనులు చూపాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా కూలీలపై కక్షగట్టి ఆ చట్టాన్ని రద్దుచేసి పీబీజీ రాంజీ చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. గత చట్టంలో కార్మికులకు ఉన్న సౌకర్యాలను ఈ చట్టంలో రద్దు చేసింది అన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం 90% నిధులు ఇస్తే రాష్ట్రం 10% నిధులు ఇచ్చేది అన్నారు. కొత్త చట్టంలో కేవలం 60 శాతం మాత్రమే కేంద్రం ఇస్తుందని చెప్పడం ఉపాధి కూలీలను నట్టేట ముంచడమేనన్నారు. గత 12 సంవత్సరాలుగా బడ్జెట్లో ఉపాధిహామీ పథకానికి నిధులు కోత పెడుతూ వస్తుందన్నారు. ఈ బడ్జెట్లో ఆరు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పేదలకు ఉపాధి కల్పించే బాధ్యతనుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకుంటుందన్నారు. పేదల పుట్టగొట్టే చట్టాన్ని తీసుకొచ్చిన బిజెపి ప్రజా ప్రతినిధులను ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ కూలీలందరూ బిజెపి తీసుకొచ్చిన విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేసే వరకు ఐక్యంగా సమరశీల పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య సంగం గ్రామ కమిటీ సభ్యులు నల్ల అరుంధతి పుల్లంకొండ ముత్తమ్మ వల్లపు తిరుపతమ్మ రేపని నాగమ్మ పల్లపు కృష్ణవేణి నగ్రా సక్కు బాయ్ ఉల్లం కొండ ధనమ్మ సంతోష తదితరులు పాల్గొన్నారు.

# 15% నిధులు విద్యారంగానికి కేటాయించాల్సిందే





రాష్ట్రంలో గత 12 ఏళ్లుగా విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైపోయింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యారంగానికి 15% నిధులు కేటాయిస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం 2024-2 5 సంవత్సరానికి గాను 7.3 % 2025-26 సంవత్సరానికి గాను 7.5% నిధులు కేటాయించడం జరిగింది. ఈ కేటాయింపుల ద్వారానే ప్రభుత్వానికి విద్యారంగంపై ఉన్న చిత్తశుద్ధితో అర్థమవుతుంది..

**మౌలిక సదుపాయాలు మరిచితిరా**

రాష్ట్రంలోనే ప్రభుత్వ పాఠశాలలో ,గురుకులాలలో, ఇంటర్ మరియు డిగ్రీ కాలేజీలలో మౌలికసదుపాయాల కల్పన కనీసం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎక్కడ కూడా సరైన త్రాగునీటి వ్యవస్థ ఉండదు. వాష్ రూమ్ విద్యార్థులకు సరిపడాలేవు. ఉన్న వాటి నిర్వహణ సక్రమంగా నిర్వహించరు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధించడానికి బ్లాక్ బోర్డ్స్ లేని పాఠశాలలు కూడా రాష్ట్రంలో ఉన్నాయనిడంలో సందేహం లేదు. సరైన వెంటిలేషన్, లైటింగ్ మరియు ఫ్యాన్లు పాఠశాల కాలేజీలలో లేవు. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి దోహదపడే ఆటలు ఆడుకోవడానికి ప్లే గ్రౌండ్ లేని ప్రభుత్వ పాఠశాలలో కాలేజీలు ఎన్నో. గ్రౌండ్ ఉన్న స్పోర్ట్ ఎక్విప్మెంట్ అసలే ఉండవు. పాఠశాల కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరుకొని పెక్కులూడిపడే విద్యార్థులపై, ఉపాధ్యాయులపై పడి గాయాల పాలవుతున్న నూతన భవన నిర్మాణాల ఊసే లేదు. విద్యార్థుల ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకుని పాఠశాల కళాశాలకు వెళుతున్న దుస్థితి. రాష్ట్రంలో 2554 ప్రభుత్వ బడులను ఒకే తరగతి గది తో నడుపుతున్నారు. సరైన సమయంలో విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్ అందడం లేదు. నాణ్యమైన పాఠశాల యూనిఫాంలు విద్యార్థులకు ఇవ్వడం లేదు. ప్రాక్టికల్స్ కోసం ల్యాబ్ లలో అవసరమైన పరికరాలు అసలే లేవు. విద్యార్థులు తరగతి గదిలో కూర్చోవడానికి సరైన బెంచీలు కూడా ఉండవు. విద్యకు నిలయాలుగా ఉన్న విశ్వవిద్యాలయాలకు కూడా నేడు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయి.


**నాణ్యతలేని భోజనం**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గురుకులాలలో సంక్షేమ హాస్టల్లో నిరంతరం ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్న విషయం విధితమే. 2025 ఎన్ హెచ్ ఆర్ సి నివేదిక ప్రకారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 886 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురై హాస్పిటల్ పాలయ్యారు. 48 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కారణంగా మరణించినట్టు వెల్లడించడం జరిగింది .

**సరిపడా బడ్జెట్ తోనే సమస్యలకు పరిష్కారం**

రాష్ట్రంలో విద్యారంగం గాడిన పడాలన్న విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావాలన్నా రాష్ట్రం సమగ్ర అభివృద్ధి చెందాలన్నా విద్యార్థుల భవితవ్యం బాగుండాలన్నా ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్ లో విద్యారంగానికి 15% నిధులు కేటాయించాల్సిందే.

హరీష్ సాగర్
సాందీపని మాసపత్రిక స్టేట్ కన్వీనర్
6302758830



# ఎలిగేడు నర్సాపూర్‌లో చెత్త సేకరణ రిక్షాల ప్రారంభం



**ఎలిగేడు, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన సైకిల్ రిక్షాలను సోమవారం సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గ్రామంలోని ప్రతి వీధిలో సైకిల్ రిక్షాల ద్వారా చెత్త, చెదారం తొలగించి నర్సాపూర్‌ను పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దుతాం" అని పేర్కొన్నారు. అనంతరం గ్రామసభను నిర్వహించి గ్రామాభివృద్ధి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గాలికుంటు నివారణ టీకా తప్పక వేయించాలి



**ఎలిగేడు, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పశువులకు గాలికుంటు నివారణ టీకా తప్పక వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వేణుగోపాల్ సూచించారు. ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామంలో నిర్వహించిన టీకా కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ, "గాలికుంటు వ్యాధి సోకిన పశువులలో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా టీకా వేయడం అత్యంత అవసరం" అని పేర్కొన్నారు. పశుపోషకులు ప్రతి పశువుకు టీకా వేయించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గ్రామంలో మంగళవారం కూడా ఈ టీకా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారిణి ఝాన్సీ, సర్పంచ్ కొమురయ్య, ఉపసర్పంచ్ మేచినేని అండాలు, వెటర్నరీ అసిస్టెంట్ శంకర్, పశుపోషకులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని వినతి



**ఎలిగేడు, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండల ఆశా వర్కర్స్ తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం మండల వైద్యాధికారి నిస్సి క్రిస్టిన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన 18,000 రూపాయల ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని, ఏఎన్‌సీ, పీఎన్‌సీ, టార్గెట్లు రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పారితోషికాలు, బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఈ నెల 23న కలెక్టరేట్ వద్ద ధర్నా, 28న చలో హైదరాబాద్ కార్యక్రమాలకు హాజరై తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని ఆశా వర్కర్స్ స్పష్టం చేశారు.

## పార్లమెంట్ భవన్ ముట్టడిలో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి




**దేవరకొండ, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఢిల్లీలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన పార్లమెంట్ భవన్ ముట్టడిలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జరుపుల లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "బీజేపీ చేతగాని పాలనకు నిదర్శనం దేశంలో గ్యాస్ కొరతే. వంట గ్యాస్ కొరతతో సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారాన్ని మోపిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు సరఫరా కూడా చేయలేకపోవడం సిగ్గుచేటు. పేదలు, మధ్యతరగతి కుటుంబాలు వంట గ్యాస్ కోసం ఇబ్బంది పడుతున్నాయి. ఇది కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనం" అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఖాలీద్, కో-ఇన్‌చార్జ్ భవ్య, జైస్వాల్ రోహిణి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వం వైఫల్యంతోనే చమురు సంక్షోభం -- సీపీఐ




**దేవరకొండ, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేశంలో నెలకొన్న చమురు సంక్షోభం మోడీ ప్రభుత్వ వైఫల్యమేనని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం కొండమల్లేపల్లి తహసిల్దార్ కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం దూరదృష్టి లేని విధానాలు, తప్పుడు ప్రాధాన్యతలతో దేశాన్ని సంక్షోభంలోకి నెట్టింది. గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచి ప్రజలపై భారాన్ని మోపిన ప్రభుత్వం ఇప్పుడు సరఫరా కూడా చేయలేకపోవడం సిగ్గుచేటు. ఎల్పీజీ ధరల పెరుగుదలతో లక్షలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. చిన్న తినుబండారాలు, టీ స్టాళ్లు, ధాబాలు, రెస్టారెంట్లు కూడా తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా సామ్రాజ్యవాద కాంక్షతోనే యుద్ధం కొనసాగుతోందని, ప్రపంచ దేశాలు శాంతి కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. భారతదేశం చమురు కొనుగోలు విషయంలో సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవాలని, అమెరికా పెత్తనాన్ని అంగీకరించరాదని స్పష్టం చేశారు. సీపీఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, "యుద్ధం వల్ల ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరుగుతుంది. దేశాల మధ్య విభేదాలు పెరుగుతాయి. ప్రపంచం శాంతియుతంగా ఉండాలంటే యుద్ధాలు వద్ద" అని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో పేద, మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ నాయకులు పెరికేటి శేఖరాచారి, సోమ్లా నాయక్, పన్నల శ్రీనివాస్, కల్లు చరణ్‌రెడ్డి, వీరస్వామి, ధర్మయ్య, వెంకటయ్య, యాదయ్య, నగేష్, మధు, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు సోమ్లా నాయక్, కార్యదర్శి ఆకులపల్లి వెంకటయ్య, శంకర్, హథీరాం శ్రీను, మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మార్వోకు మెమొరాండం అందజేశారు.

# కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి




**ఆమనగల్లు, మార్చి 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే ఉచిత కంటి వైద్య ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కే. గోవర్ధన్ రెడ్డి కోరారు. సోమవారం పట్టణంలో రామ్ రెడ్డి లయన్ విజన్ సెంటర్లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు రామ్ రెడ్డి లయన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని గోవర్ధన్ రెడ్డి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కండ్లను దానం చేయాలని మనం ఇద్దరికీ దృష్టి భాగ్యం కల్పించాలని ఆయన కోరారు. కంటి వైద్యులు ఎం చంద్రశేఖర్ 185 మందిని కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 43 మందిని ఆపరేషన్ నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాస్, జిల్లా చైర్మన్ బి నటరాజ్ యాదయ్య, కొరివి వెంకటయ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్లు ముందస్తు అరెస్టు




**ఇబ్రహీంపట్నం**
**మార్చి 16 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన అంగన్వాడీ టీచర్లను సోమవారం హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ లు తెల్లవారుజామున పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే కార్యక్రమానికి వెళ్లకుండా వారిని ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సంధ్భంగా రంగారెడ్డి జిల్లా జxఖ నాయకురాలు అంగన్వాడీ టీచర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ..ఐసిడిఎస్ వ్యవస్థను బలపర్చాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టిన రూ.18 వేల వేతనం చెల్లించాలని, వేసవి సెలవులు ఇవ్వాలని తదితర డిమాండ్లతో నేడు హైదరాబాద్ ఇందిరాపార్క్ కు బయల్దేరుతున్న అంగన్‌వాడీ టీచర్లను, రాష్ట్ర నాయకత్వాన్ని, అరెస్టు చేసి నిర్బంధించడం హేయమైన చర్య అన్నారు. తాము ప్రజాస్వామ్య పద్ధతుల్లో సభ నిర్వహణ కోసం హైదరాబాద్ పోలీస్ పర్మిషన్ తీసుకున్నప్పటికి అరెస్టు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే గత ప్రభుత్వాలకు పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు.

# పిల్లల భద్రతపై తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి




**ఆమనగల్లు, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఒంటిపూట బడులు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమనగల్లు ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, వేసవి ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నందున పిల్లలు ఈత కోసం చెరువులు, కుంటలు వంటి నీటి వనరుల వద్దకు వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల కదలికలపై కచ్చితమైన నిఘా ఉంచాలని, మైనర్ పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ద్విచక్రవాహనాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. వాహనాలు నడుపుతూ పోలీసులు పట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పిల్లల భద్రతను నిరంతరం పర్యవేక్షించడం, వారికి సరైన మార్గనిర్దేశం చేయడం తల్లిదండ్రుల బాధ్యత అని ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

## పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత

- మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్





**ఆమనగల్లు,**
**మార్చి 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మెన్ పత్యనాయక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులోని అంగన్వాడి కేంద్రాన్ని అవార్డు కౌన్సిలర్ పుల్లారెడ్డి అనూష శ్రీశైలం తో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా కేంద్రంలో ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చిన్నారులు, గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పోషకాహారం, సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన సేవలు అందేలా చూడాలని ఆయన సూచించారు. అనంతరం వార్డులో మంచినీటి సమస్య ఉందని తెలుసుకొని మున్సిపల్ సిబ్బందితో పైపులైను పనులను మరమ్మత్తు చేయించారు. ప్రజలు కూడా అధికారులతో కలిసి పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ప్రత్యేకంగా పట్టణాల్లో పారిశుధ్యం మెరుగుపర్చడం, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా నిర్వహించడం, కార్యాలయాల పరిశుభ్రత, పన్ను వసూళ్లు, ఫైల్స్ క్లియరెన్స్, నిరంతరం తాగునీటి సరఫరా చేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రమేష్, రాము, గణేష్ తదితరులు ఉన్నారు.

# సోదరభావంతో మెలగాలి - తల్లోజు ఆచారి



**ఆమనగల్లు, మార్చి 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రజలందరూ సోదరభావంతో మెలగాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. ముస్లిం సోదరులు నెల రోజుల పాటు కఠిన ఉపవాసాలు పాటిస్తూ భక్తి, నియమ నిష్ఠలతో ప్రార్థనలు చేయడం గొప్ప సంప్రదాయన్నీ పేర్కొన్నారు. సోమవారం అమనగల్లు మున్సిపాలిటీలోని విద్యా నగర్ కాలనీ అధ్యక్షుడు యం.ఎ పాషా ఆధ్వర్యంలో పాషా తల్లితండ్రులు, భార్య జ్ఞాపకార్థం మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, మున్సిపల్ ఛైర్మన్ పత్యానాయక్, మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, కౌన్సిలర్ మహేష్, నిరంజన్ పాల్గొన్నారు. అనంతరం పాషా తో కలిసి మున్సిపల్ కార్మికులకు చీరలు పంపిణి చేశారు. ముస్లిం సోదర సోదరీమణులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అఖిల్ నవాజ్ ఖాన్, కలీమ్, అజీమ్, నాజర్, హాఫిజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీడిడి స్టాప్ అసోసియేషన్ వార్షిక డైరీ ఆవిష్కరించిన నల్గొండ జిల్లా కలెక్టర్

**- పాల్గొన్న జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శశికళ, స్టాప్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ, హౌసింగ్ పిడి రాజ్ కుమార్...**







**నల్గొండ,మార్చ్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాప్ అసోసియేషన్ వార్షిక డైరీ నీ 2026 ను నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్సీడిడి డిప్యూటీ డైరెక్టర్ శశికళ, ఎస్సీడిడి మినిస్టీరియల్ స్టాప్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్పి రాజ్ కుమార్ ల చేతుల మీదుగా డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది... ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ సూపరింటెండెంట్ లు జి.సుధీర్, ఎస్సిడిడి అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్లపూడి జైపాల్, టిఎన్జిఓ జిల్లా అసోసియట్ ప్రెసిడెంట్ డిఐ రాజు, కార్పొరేషన్ సూపరింటెండెంట్ లు బి.గోపాలకృష్ణ, జి.గోవర్ధన్ రెడ్డి, డి.ప్రసాద్, ట్రేడ్ యూనియన్ నాయకులు వై.రాంరెడ్డి, ఏఎస్ డబ్ల్యుఓ డి.స్వామి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ జిల్లా కార్యదర్శి ఏ.సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది క్రాంతి కుమార్, లావణ్య, మురళి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



**ఎలిగేడు, మార్చి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గత ఏడాది మార్చి 3న ఎలిగేడు గ్రామానికి చెందిన గూడెల్లి మహేష్ ఎలిగేడు నుండి కరీంనగర్ వెళ్తుండగా, ఎలిగేడు బీసీ కాలనీ వద్ద ఆయన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు.సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆన్లైన్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం, సంవత్సరం తర్వాత జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ సెల్‌ఫోన్‌ను బాధితుడు మహేష్‌కు సోమవారం అందజేశారు.పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను తిరిగి అప్పగించిన ఎస్సై సనత్‌కుమార్‌కు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# గవర్నర్ ప్రసంగం అంతా 'గాలిలో మేడలే'..

**- క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరు**
**-బతుకమ్మ లేని తెలంగాణ తల్లి.. ఆత్మ లేని దేహం!**
**-ఉద్యమ చరిత్రను చెరిపేసేందుకే రేవంత్ సర్కార్ కుట్ర**
**-కప్పాటి పాండురంగారెడ్డి**



రంగారెడ్డి జిల్లా మార్చి 16 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) : ఇవాళ తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించిన బతుకమ్మ లేని తెలంగాణ తల్లి విగ్రహం ఎంత మాత్రమూ తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం కాదు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపనట్టుగా బతుకమ్మ సమస్త తెలంగాణ సంస్కృతికి ప్రతీక.

చరిత్ర నిర్మాణంలో పాల్గొనని వారు మొదట చేయాలనుకునే పని చరిత్రను చెరిపేయాలని చూడడం. కుదరకపోతే వక్రీకరించాలని చూడడం. ఇప్పుడు తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న పనులు ఇవే. నేడు తెలంగాణలో నూటికి 90 మందికి రేవంత్ రెడ్డి కన్నా గొప్ప తెలంగాణ ఉద్యమ నేపథ్యం ఉన్నది. తనకు స్థానం లేని ఉద్యమ చరిత్రను రూపుమాపాలి అనే అల్పసంతోషం తప్ప ఇది మరొకటి కాదు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా చేసిన ప్రసంగం పట్ల తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ, అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరిగిందని జాగృతి నాయకుడు విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులకు విడుదల చేసిన ప్రకటన

ప్రసంగంలోని డొల్లతనం – పచ్చి నిజాలు: 2047 లక్ష్యం.. నేటి సంక్షోభం ఎవరికి కావాలి?: 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అని కలలు చూపిస్తున్న ప్రభుత్వం, ప్రస్తుతం అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని ఎలా గట్టెక్కిస్తుందో చెప్పడం లేదు. భవిష్యత్తు గురించి ఊహాచిత్రాలు గీస్తూ, నేటి నిరుద్యోగతను, ఆర్థిక ఇబ్బందులను గాలికొదిలేశారు.

జీహెచ్‌ఎంసీ విభజన – పరిపాలనా సౌలభ్యమా? రాజకీయ స్వార్థమా?: హైదరాబాద్ నగరాన్ని విస్తరిస్తూ జీహెచ్‌ఎంసీని మూడు ముక్కలు చేయడం వెనుక గల అసలు ఉద్దేశం రాజకీయ ఆధిపత్యమే తప్ప ప్రజల సౌకర్యం కాదు. దీనివల్ల సామాన్యుడికి ఒరిగేదేమీ లేదు, కేవలం అధికారుల సంఖ్య, ఖర్చు పెరుగుతుంది.


మూసీ ప్రక్షాళన – పేదల వెలివేత: మూసీ నది ప్రక్షాళన పేరుతో వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులు ప్రకటిస్తున్నారు కానీ, దాని వల్ల నిరాశ్రయులవుతున్న వేలాది పేద కుటుంబాల పరిస్థితి ఏంటి? హిమాయత్‌సాగర్ నుంచి గాంధీసరోవర్ వరకు అభివృద్ధి అంటే.. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారమా? ఇక రైతు భరోసా – క్షేత్రస్థాయిలో అన్యాయం: 9 రోజుల్లో రూ.9వేల కోట్లు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఇంకా ఎంతమంది కౌలు రైతులు, సామాన్య రైతులు సాయం అందక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారో పట్టించుకోవడం లేదు. 'రేర్' నమూనా పేరుతో వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది.ఇందిరమ్మ ఇళ్లు – ఆచరణ సాధ్యమేనా?: 4 లక్షల ఇళ్ల నిర్మాణం అని చెబుతున్న ప్రభుత్వం, గతంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్లకు నిధులు ఎందుకు విడుదల చేయడం లేదు? కొత్త ఇళ్ల మంజూరు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు.

బుల్లెట్ రైళ్లు, విమానాశ్రయాలు – సామాన్యుడికి దూరం: వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల ముచ్చట దశాబ్దాలుగా వింటున్నదే. ఇవన్నీ ఎన్నికల తాయిలాలుగానే కనిపిస్తున్నాయి తప్ప, సామాన్యుడి రవాణా కష్టాలను తీర్చేవి కావు.

"ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజాపాలన' కేవలం దరఖాస్తుల స్వీకరణకే పరిమితమైంది. పరిష్కారం చూపని 47 వేల పిటిషన్ల గణాంకాలు దేనికి సంకేతం? ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసే విధంగా ఈ ప్రసంగం ఉంది. 'జాగృతి' తెలంగాణ ప్రజల పక్షాన నిలబడి, ఈ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటుంది. అని పాండురంగారెడ్డి అన్నారు.

# లడాఖ్ మట్టి సూక్ష్మజీవులతో క్యాన్సర్ చికిత్స

**లడాఖ్:**
కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసర్చ్(సీఎస్ఐఆర్) పరిశోధకులు కొత్త విషయాన్ని కనుగొన్నారు. లడాఖ్ మట్టిలో ఉండే సూక్ష్మజీవుల ద్వారా క్యాన్సర్, టీబీ, డయాబెటిస్‌కు చికిత్సను అందివ్వోచ్చు అని తేల్చారు. అక్కడి సూక్ష్మజీవుల్లో ఉండే రసాయనక పదార్థంతో అనేక మొండి వ్యాధులకు ట్రీట్మెంట్ చేయవచ్చు అని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. స్ట్రెప్టోమైసెస్ నెట్రోప్సిస్ అనే బ్యాక్టీరియాను పరిశోధకులు విశ్లేషించారు. ఆ సూక్ష్మజీవిలో సుమారు 13 రకాల రసాయనాలు ఉన్నట్లు గుర్తించారు. ఆ ఆల్కలాయిడ్స్‌లో పింప్రినిత్రైన్ అనే పదార్థం ఉన్నట్లు కనుగొన్నారు.సమగ్రమైన స్పెక్ట్రోస్కోపిక్ టెక్నిక్‌లతో ఆ రసాయనాన్ని అధ్యయనం చేశారు. పింప్రినిత్రైన్‌తో చాలా రకాల ఉపయోగాలు ఉన్నట్లు నిర్ధారించారు. యాంటీ మైక్రోబియల్, సైటోటాక్సిక్ యాక్టివిటీ ఆ పదార్థంలో ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ప్రోస్టేట్ క్యాన్సర్ కణాల చికిత్సలో ఈ పదార్థం కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సీఎస్ఐఆర్ పరిశోధకులు చెప్పారు. అంటువ్యాధులు, నాన్ కమ్యూనికెబుల్ వ్యాధుల చికిత్సలో పింప్రినిత్రైన్ సమర్థవంతంగా




పనిచేస్తున్నట్లు తేల్చారు. సీఎస్ఐఆర్‌కు చెందిన ఇండియన్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసర్చ్ సంస్థలు ఈ అధ్యయనంలో పాల్గొన్నాయి.బయోరిసోర్స్ టెక్నాలజీ జర్నల్‌లో దీనిపై సమీక్షను ప్రచురించారు. సూక్ష్మజీవుల్లో ఉండే కొన్ని రకాల సహజసిద్ధమైన రసాయనాల్లో యాంటీబయాటిక్, యాంటీ క్యాన్సర్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నట్లు స్టడీలో పేర్కొన్నారు. హృద్రోగ సంబంధిత వ్యాధుల చికిత్సలోనూ ఆ రసాయనాలు కీలకం అవుతాయన్నారు. లేహ్–లడాఖ్‌లోని హిమాలయ ప్రాంతం సూక్ష్మజీవులకు అనుకూలమైందని పరిశోధకులు చెప్పారు.

## ప్రతి నియోజకవర్గంలోనూ డిఎంకె విజయం సాధించాలి

**చెన్నై**


అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి నియోజకవర్గంలోనూ డిఎంకె విజయం సాధించాలని, ఆవిధంగా కష్టపడాలని డిఎంకె అధ్యక్షులు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ పార్టీ నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం చెన్నైలో పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శులతో జరిగిన సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ.. 'నిన్ననే ఎన్నికల తేదీని ప్రకటించారు. ఏప్రిల్ 23కి కేవలం 39 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. మన పార్టీ ఎన్నికల పనికి సిద్ధమైంది. సంక్రాంతికి అన్ని కుటుంబాలకు రూ. 3 అందించడం, 1.31 కోట్ల కుటుంబాలకు మహిళా హక్కుల సహాయంగా రూ. 5 వేలు మంజూరు చేయడం, సీనియర్ సిటిజన్లు, వికలాంగులు సహా దాదాపు 40 లక్షల మందికి రూ. 2,000 ప్రత్యేక ఆర్థిక సహాయం అందించడం వంటి మన సంక్షేమ పథకాల ద్వారా ప్రజలలో మనకు మద్దతు గణనీయంగా ఉంది. ఎన్నికల్లో మనం పోటీ చేసే ప్రతి నియోజకవర్గంలోనూ విజయం సాధించాలి. కూటమి భాగస్వాములతో కలిసి 200 నియోజకవర్గాలను గెలవడమే మన లక్ష్యం. కష్టపడి పని చేయండి. మనమంతా కలిసి పనిచేద్దాం. మనం గెలుస్తాం' అని స్టాలిన్ మార్గనిర్దేశం చేశారు.

## 8 ఏళ్ల బాలికపై.. ముగ్గురు బాలురు సామూహిక అత్యాచారం

**న్యూఢిల్లీ:**


ముగ్గురు బాలురు కలిసి 8 ఏళ్ల బాలికను గోడౌన్‌లోకి తీసుకెళ్లారు. అక్కడ ఆమెపై సామూహిక అత్యాచారం చేశారు. వరుసగా రెండు రోజులు లైంగిక దాడికి పాల్పడ్డారు. బాధిత బాలిక ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు నిందితులైన ముగ్గురు మైనర్ బాలురను అదుపులోకి తీసుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. ఓఖ్లా ప్రాంతానికి చెందిన 12 ఏళ్ల బాలుడు, 13 ఏళ్ల వయస్సున్న ఇద్దరు బాలురు కలిసి 8 ఏళ్ల బాలికను ఆశ పెట్టారు. మార్చి 12, 13న బాలిక ఇంటి సమీపంలో ఉన్న గోదాములోకి ఆమెను తీసుకెళ్లారు. ఆ రెండు రోజులు పగటి వేళ ఆ గోదాంలో బాలిక లోదుస్తులు విప్పి ముగ్గురు బాలురు ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు కాగా, మార్చి 14న పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో మహిళా పోలీస్ అధికారిణితో కూడిన పోలీస్ బృందం ఆ ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు చేసింది. బాధిత బాలికను వైద్య పరీక్షల కోసం ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా పోక్సో చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులైన ముగ్గురు బాలనేరస్థులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. వారిని జువినెల్ హోమ్‌కు తరలించినట్లు వెల్లడించారు.